
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్ర) సా.6.24
సహరి (శని) ఉ.4.38

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	24.0

ఇక యుద్ధమే..





ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు
ఆరని అసమ్మతి సెగలు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఎన్నికల యుద్ధం మొదలైంది. ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. టీడీపీ- జనసేన- బీజేపీ పొత్తుతో కొందరు సీనియర్ నేతలకు న్యాయం జరగలేదు. కానీ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న అధికార వైసీపీని గద్దెదించడం, రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడడం, ప్రజలకు శాంతిభద్రతలు కల్పించడమే లక్ష్యాలుగా ఏకమైన ఈ కూటమివల్ల కొందరు త్యాగాల తప్పవని, వారందరికీ అధికారంలోకి రాగానే స్థాయికి తగనివిధంగా హోదా కల్పిస్తామనే హామీలు ఇస్తూ, బుజ్జగిస్తూ పార్టీలు ముందుకుపోతున్నాయి. వైసీపీ కూడా మొత్తం అభ్యర్థులను ఖరారుచేసింది. కానీ వారిలో గ్రూపులు పెరుగుతూనే ఉన్నాయి. అసమ్మతి ఆరలేదు. 20రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. వచ్చేనెల అంటే ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పటినుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. 29తో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది. మే 13న పోలింగ్. ఇప్పటివరకూ చాలారోజులు ఉన్నాయిలే అనుకున్నారు.. కానీ కౌంట్‌డౌన్ మొదలైంది. రోజులు చకచకా మారిపోతున్నాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీస్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉండగా టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను ఖరా రు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో నాలుగు అసెంబ్లీస్థానాల్లో టీడీపీ, రెండు అసెంబ్లీ స్థానాల్లో జనసేన, పార్లమెంట్‌తోపాటు ఒక అసెంబ్లీ స్థానంలో బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని టీడీపీ తొలి జాబితాలోనే అనపర్తి అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, అనూహ్యంగా బీజేపీ కోటాలోకి పోయింది. ఇక రాజమహేంద్రవరం సిటీ, రూరల్, గోపాలపురం, కొవ్వూరు స్థానాల నుంచి టీడీపీ, నిడద వోలు, రాజానగరంనుంచి జనసేన ఉమ్మడి అభ్యర్థులను పోటీపెట్టగా, రాజమహేంద్రవరం లోక్‌సభ, అనపర్తి అసెంబ్లీ స్థానాల నుంచి బీజేపీ అభ్యర్థులు ఖరారయ్యారు. గత శనివారం వైసీపీ కూడా తమ అభ్యర్థులను ప్రకటించింది. వైసీపీలో ఎస్సీ, బీసీ అభ్యర్థుల అసెంబ్లీ స్థానాలను బదిలీ చేయడంతో ఆయా వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. ఈసారి జిల్లాలో టీడీపీ- జనసేన, బీజేపీ కూటమి నుంచి సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, గోపాలపురం టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, అనపర్తినుంచి ఎం.శివకృష్ణంరాజు తొలిసారి ఎన్నికల బరిలోకి వచ్చారు. వాసు, వెంకట్రాజు విద్యావంతులు కాగా, బలరామకృష్ణ వ్యాపారి, ఆధ్యాత్మికవేత్త. కృష్ణంరాజు ఎక్స్ మిలట్రీ మ్యాన్. ఇక నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన నాయకుడు. రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి సిట్టింగ్ ఎమ్మెల్యే కూడా. కొవ్వూరు టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు గతంలో గోపాలపురంనుంచి టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేశారు. కూటమి ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి ఎన్టీఆర్ కుమార్తె. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు కూడా.. ఇక వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ రాజకీయాలకు పూర్తిగా కొత్త. ఆయన డాక్టర్. అనుకోకుండా ఎంపీ బరిలోకి దిగారు.

• రాజమహేంద్రవరం సిటీలో వాసు వర్సెస్ భరత్

రాజమహేంద్రవరం సిటీలో టీడీపీ అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసు, వైసీపీ అభ్యర్థిగా ఎంపీ మార్గాని భరత్ పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. ఇది టీడీపీకి కంచుకోట. 2019లో వైసీపీ గాలి వీచిన సమయంలో కూడా ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసు సతీమణి ఆదిరెడ్డి భవానీ గెలిచారు. పైగా ఇప్పుడు వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈనేపథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసు బలంగా జనంలోకి వెళుతున్నారు. వైసీపీలో గ్రూపులెక్కువ. గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా రౌతు సూర్యప్రకాశరావు పోటీచేసి ఓడిపోయారు. వైసీపీ సీనియర్ నేతలను పక్కన పెట్టారన్న అసంతృప్తి ప్రస్తుత సిటీ అభ్యర్థి భరత్‌కు తగలనుంది.

• రూరల్‌లో గోరంట్ల వర్సెస్ చెల్లుబోయిన

రాజమహేంద్రవరం రూరల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగగా, వైసీపీ అభ్యర్థిగా మంత్రి చెల్లుబోయిన వేణు రంగంలోకి దిగారు. కానీ ఆయనను రామచంద్రపురం నుంచి ఇక్కడకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. వైసీపీ కేవలం బలహీనవర్గాలనే ఒక నియోజకవర్గంలో ఉండనీయకుండా, ఇక్కడకు బదిలీ చేశారనే విమర్శ ఉంది. అంతేకాక గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ అభ్యర్థి ఆకుల వీర్రాజు పోటీ చేశారు. ఈసారి ఆయనకు సీటు దక్కలేదు. ఇక్కడ వైసీపీ కోఆర్డినేటర్‌గా కష్టపడిన చందన రమేష్‌ను పార్టీ అన్యాయం చేసిందనే వాదన కూడా ఉంది. ఇలా స్థానికంగా ఆ పార్టీ నేతల్లో గందరగోళం నెలకొంది. ఇక కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రెండు దఫాలుగా ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నారు. మూడోసారి ఇప్పుడు ఎన్నికలకు వెళుతున్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాలతోనూ మంచి సంబంధాలు ఉన్న నేతగా ఆయనకు పేరుంది.

• రాజానగరంలో బత్తుల వర్సెస్ జక్కంపూడి

రాజానగరంలో జనసేన తరఫున కూటమి అభ్యర్థిగా బత్తుల బల రామకృష్ణ బరిలోకి దిగారు. ఇక్కడ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మరోసారి బరిలోకి దిగారు. ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన నేతలు. ఈసారి ఎలాగైనా గెలవాలని కూటమి అభ్యర్థి పనిచేస్తున్నారు. ఇక్కడ టీడీపీ టిక్కెట్టు ఆశించిన నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ పార్టీ ఆదేశాల మేరకు పనిచేయడానికి ముందుకురావడం కూటమికి కలిసొచ్చే అంశం. ఎక్కడా అసంతృప్తి లేకుండా కలసి ముందుకు సాగుతున్నారు.

• అనపర్తిలో కృష్ణంరాజు వర్సెస్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి నియోజకవర్గంలో బీజేపీకి అనూహ్యంగా సీటు లభించింది. ఇక్కడ టీడీపీ తొలి జాబితాలోనే టీడీపీ తరఫున కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించగా, పొత్తు వల్ల ఈ సీటును బీజేపీ తీసుకుంది. తర్వాత రంగాపురానికి చెందిన ఎక్స్‌మిలట్రీ కృష్ణంరాజును అభ్యర్థిగా ప్రకటించింది. ఇది టీడీపీ కేడర్‌కు ఇబ్బంది. ఇక్కడ పరిస్థితులు ఎలా మారతాయో చెప్పలేని విధంగా ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి కృష్ణంరాజు ఇక రంగంలోకి దిగారు. ఆయనతో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తలపడనున్నారు. ఇక్కడ వైసీపీ మీద ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, అభివృద్ధి ఏమాత్రం లేకపోవడం వైసీపీకి మైనస్‌గా ఉన్నాయి.

• కొవ్వూరులో ముప్పిడి వర్సెస్ తలారి

కొవ్వూరు నియోజకవర్గంలో పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ కూడా గోపాలపురం నియోజకవర్గం నుంచి దిగుమతి అయినవాళ్లే. కానీ వీరిద్దరూ మూడు ఎన్నికల నుంచి ఒకరిపై ఒకరు పోటీ చేస్తున్నారు. 2014లో ముప్పిడి వెంకటేశ్వరరావు గెలవగా, 2019లో తలారి వెంకట్రావు గెలిచారు. ఈసారి కొవ్వూరు నుంచి టీడీపీ తరఫున ముప్పిడి, వైసీపీ తరఫున తలారి పోటీపడుతున్నారు. ఇక్కడ గెలిచి మంత్రి పదవి దక్కించుకుని, ఇవాళ గోపాలపురం బదిలీ అయిన తానేటి వనిత వైఖరి వల్ల వైసీపీ రెండుగా చీలిపోయింది. ఇక టీడీపీ అభ్యర్థి ముప్పిడిని ఓ ప్రధాన వర్గం కావాలని తీసుకొచ్చింది. టీడీపీ ద్విసభ్య కమిటీ కష్టపడి పనిచేస్తోంది. ఇక్కడ టిక్కెట్ ఆశించి భంగపడ్డ మాజీ మంత్రి జవహర్‌కు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో సానుకూలం వాతావరణం నెలకొంటోంది.

• గోపాలపురం నుంచి మద్దిపాటి వర్సెస్ మంత్రి తానేటి

గోపాలపురం ఎస్సీ నియోజకవర్గం నుంచి ఈసారి టీడీపీ తరఫున కూటమి అభ్యర్థిగా విద్యావంతుడైన మద్దిపాటి వెంకట్రాజు రంగంలో ఉన్న సంగతి తెలిసిందే. ఆయన రాష్ట్ర హోంమంత్రి, వైసీపీ అభ్యర్థిని తానేటి వనితపై పోటీకి దిగారు. ఇక్కడ కూటమి బలంగా ఉంది. కానీ ఇక్కడ మద్దిపాటికి, మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపాటి బాపిరాజు వర్గం ఇంకా సహకరించడంలేదు. ఇటీవల కొందరు పెద్దలు జోక్యంచేసుకుని, అసమ్మతి బుజ్జగించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. వైసీపీ అభ్యర్థిని హోంమంత్రి తానేటి వనిత గతంలో కొవ్వూరు వ్యవహరించిన తీరు ఆమెను ఇంకా వెంటాడుతూనే ఉంది. అది ఆమెకు పెద్ద సమస్యే. వైసీపీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను అధిగమించి ఎన్నికల్లో ముందుకు సాగడం మరో సమస్య.

• నిడదవోలులో దుర్గేష్ వర్సెస్ శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా జనసేన తరఫున మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడుపై పోటీపడుతున్నారు. ఇక్కడ టీడీపీకి టిక్కెట్ రాకపోవడంతో ఏర్పడిన అసంతృప్తి కూడా చల్లారిందని భావిస్తున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వర్గం మొదట జనసేన అభ్యర్థిని వ్యతిరేకించినా, చంద్రబాబుతో శేషారావు భేటీ అయిన తర్వాత సమస్య సద్దుమణిగింది. కూటమి అభ్యర్థి దుర్గేష్ కోసం శేషారావు కలిసి పనిచేస్తున్నారు. తెలుగుదేశం, జనసేన శ్రేణులు ప్రతి గ్రామంలో కలసి పనిచేసేలా ముందుకు సాగుతున్నారు. అయితే తెలుగుదేశంలో మరొక వర్గం మాత్రం అలక వహించింది. ఇక్కడ శేషారావుతోపాటు టిక్కెట్ ఆశించిన సీనియర్ నేత, వ్యాపారవేత్త కుందుల సత్యనారాయణ.. జనసేన అభ్యర్థిని ప్రకటించిన వెంటనే ఆయన స్వాగతించారు. చంద్రబాబు సీఎం కావడమే తన లక్ష్యమని, ఎవరికి సీటిచ్చినా తనకు అభ్యంతరం లేదని బహిరంగంగా ప్రకటించారు. కానీ గురువారం ఆయన, తన అనుచరుల్లోని ముఖ్యులతో సమావేశమయ్యారు. ఇంతవరకూ ప్రచారంలోకి కుందులను ఆహ్వానించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం.



పురందేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్, ఇతర నేతలు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- కూటమి అధికారంలోకి రావడం చారిత్రక అవసరం
- ప్రభుత్వాన్ని మార్చడానికి చూపుడు వేలుని వినియోగించండి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపు - 7లో



చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ జగదీశ్, పోలీసు అధికారులు

సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఎస్పీ ఆకస్మిక తనిఖీ

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. నిఘా కెమెరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయడం ఆగరాదని పేర్కొన్నారు. వాటి ఫుటేజీని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటామని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్పీ పోలీసు సిబ్బందిని హెచ్చరించారు. గోకవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణునిపాలెం వద్ద ఏర్పాటుచేసిన సరిహద్దు చెక్‌పోస్టును ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని వాహనాలను ఆయనే స్వయంగా పరిశీలించారు. సిబ్బంది తనిఖీ చేస్తున్న తీరును గమనించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, అక్రమ నగదు తదితర వాటిని నిబంధనల ప్రకారం అడ్డుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. వాహనాలను పరిశీలించే సమయంలో డ్రైవర్లు, ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ ఆదేశించారు. చెక్‌పోస్టు, సిబ్బంది మోహరింపు, తనిఖీల గురించి ఎస్పీకి గోకవరం ఎస్ఐ కె.నాగరాజు వివరించారు.

తగ్గిపోతున్న గోదావరి నీటిమట్టం

- ధవళేశ్వరం వద్ద రూ7.60 అడుగులకు నీటి మట్టం
- మూడు డెల్టాలకు మొత్తం 8,970 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, మార్చి 28: గోదావరిలో ఇన్‌ఫ్లో తగ్గుతూ ఉండడం, బేసిన్‌లో నిల్వచేసిన నీటిని వ్యవసాయావసరాలకోసం డెల్టా కాలువలకు విడుదల చేస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం నాటికి నీటిమట్టం 8.55 అడుగులు ఉండగా గురువారం సాయంత్రానికి 7.60 అడుగులకు చేరుకుంది. పాండ్ లెవెల్ 12.99 మీటర్లుగా నమోదైంది. నీటిమట్టం ఆరు అడుగులకు తగ్గి పాండ్ లెవెల్ 12 మీటర్లకు పడిపోతే స్లూయిస్ గేట్ల ద్వారా డెల్టా కాలువల్లోకి ప్రవహించే నీటి ప్రవాహ వేగం మందగిస్తుంది. గురువారం ఉదయానికి నీటిమట్టం 7.90 అడుగులుగా ఉండగా, సాయంత్రానికి నీటి మట్టం మరింత తగ్గి 7.60 అడుగులుగా నమోదైంది. ఇదిలా ఉండగా సీలేరు నుంచి విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 3500 క్యూసెక్కులు గోదావరికి వచ్చి చేరుతుండగా గోదావరిలో మొత్తం నీటి లభ్యత 7838 క్యూసెక్కులుగా ఉంది. ఇదే సమయంలో డెల్టా కాలువల ద్వారా 8970 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అంటే గోదావరిలో నిల్వచేసిన నీటి నుంచి 1132 క్యూసెక్కులు అదనంగా విడుదల చేస్తున్నారు. మొత్తంగా చూస్తే తూర్పుడెల్టాకు 2650 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1720 క్యూసెక్కు లు, పశ్చిమ డెల్టాకు 4600 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తవ్వల వీరేంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా స్వర్ణపాప 69 ఓట్లతోను, ప్రధాన కార్యదర్శిగా పి.రమేశ్ 114, సంయుక్త కార్యదర్శిగా ధర్నాలకోట వెంకటేశ్వరరావు 447, కోశాధికారిగా కె.హనుమంతరావు 447, లైబ్రరీ కొత్తపల్లి శ్రీనివాస్ 138, స్పోర్ట్ కాశీ శ్రీనివాసరావు 81, మహిళా ప్రతినిధిగా కె.వరలక్ష్మి 88 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అసోసియేషన్‌లో 1200 మంది సభ్యులుండగా 866 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం ఉత్సాహంగా పోలింగ్ జరిగింది. రాత్రికి ఫలితాలు వెల్లడికాగా, న్యాయవాది కె.మల్లేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

భర్తపై ఇటుకతో దాడి.. మృతి

- భార్య, భర్త, కొడుకు ఘర్షణ
- కుమారుడిని కత్తితో పొడిచిన తండ్రి
- క్షతగాత్రులు ఆసుపత్రికి తరలింపు

ఉండ్రాజవరం, మార్చి 28: భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త మృతి చెందాడు. ఎస్ఐ వి.అప్పలరాజు వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన ఉండ్రాజవరంలోని రామకృష్ణనగర్‌లో ఉంటున్న గుల్లంకి వెంకట్, పార్వతిలకు 20 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా వెంకట్ స్వగ్రామం తాడేపల్లిగూడెంలోను, పార్వతి తన ఇద్దరు పిల్లలతో ఉండ్రాజవరంలో ఉంటున్నారు. తరచూ వెంకట్ ఉండ్రాజవరం వచ్చి తనతో రమ్మని గొడవ పడుతుండేవాడు. ఇటీవల కూతురు పెళ్లి కారణంగా పదిరోజులుగా ఇక్కడే ఉంటున్నాడు. బుధవారం రాత్రి పార్వతిని తనతో రమ్మని మళ్లీ గొడవపడ్డారు. వెంకట్‌కు భార్య కుమారుడితో తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వెంకట్.. కుమారుడు కృష్ణవంశీని కత్తితో పొడిచాడు. కుమారుడిని పొడిచాడన్న కోపంతో పార్వతి ఇటుకతో భర్తపై దాడిచేసింది. భార్య, కొడుకు ఇటుకతో తండ్రిపై తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. గాయపడిన భర్త, కొడుకును తణుకు ఆసుపత్రికి తీసుకువెళ్లింది. వెంకట్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు, అక్కడ నుంచి విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుమారుడు కృష్ణవంశీ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అప్పలరాజు తెలిపారు. కేసును సీఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వారాహి వస్తోంది..

• రేపు సాయంత్రం చేబ్రోలులో పవన్ సభ

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తన ప్రచారానికి ఈనెల 30వ తేదీన పిఠాపురం నియోజకవర్గం నుంచి వారాహి విజయభేరి మోగించనున్నారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు రామాలయం సెంటర్‌లో వారాహి వాహనంపై నుంచి పవన్ ప్రసంగిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 7లో

రామవరంలో రచ్చరచ్చ!

- అనపర్తి సీటును టీడీపీకి కేటాయించాలంటూ తెలుగుతమ్ముళ్ల డిమాండు
- పార్టీ జెండాలు, కరపత్రాలు దహనం
- ఆగని ఆందోళన

అనపర్తి, మార్చి 28: అనపర్తి అసెంబ్లీ సీటును టీడీపీకి కాకుండా బీజేపీకి ప్రకటించడంతో గురువారం అనపర్తి మండలం రామవరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో తెలుగు తమ్ముళ్లు రచ్చరచ్చ చేశారు. సీటు మార్పు పట్ల చర్చ జరిపేందుకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశం రసాభాసాగా మారింది. నల్లమిల్లి ప్రసంగం ప్రారంభించగానే ఒక్కసారిగా నాయకులు, కార్యకర్తలు కట్టలు తెంచుకున్న ఆవేశంతో కార్యాలయంలోని టీడీపీ జెండాలను, కరపత్రాలను బయటకు తెచ్చి పెట్రోలు పోసి నిప్పంటించారు. మంటల్లో ఒక సైకిల్ వేసేందుకు ప్రయత్నం చేస్తున్న కార్యకర్తలను నల్లమిల్లి వారించారు. అనపర్తికి చెందిన ఓ కార్యకర్త.. నల్లమిల్లి నివాసంపైకి ఎక్కి అక్కడి నుంచి దూకుతానంటూ బెదిరించడంతో నల్లమిల్లి తనయుడు మనోజ్‌రెడ్డి చాకచక్యంగా అతడిని ఒడిసి పట్టుకుని కిందకు దించారు. అలాగే గొల్లలమామిడాడకు చెందిన ఐదుగురు యువకులు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయడంతో వారిని కూర్చోబెట్టి నచ్చజెప్పారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని 40 ఏళ్లుగా ప్రయాణం చేస్తున్న నల్లమిల్లి కుటుంబాన్ని కాదని, అనపర్తిలో బీజేపీకి టిక్కెట్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అనంతరం మాట్లాడిన రామకృష్ణారెడ్డి తన ప్రసంగంలో భావోద్వేగానికి లోనయ్యారు. అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రాణాలను పణంగా పెట్టిన తనకు ఇంత అన్యాయం చేయడం తగదన్నారు. కష్టపడి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని గెలుపు దిశగా తీసుకువచ్చిన తరుణంలో బీజేపీకి కేటాయిస్తుంటే చంద్రబాబు ఎందుకు మౌనం వహించారో అర్థంకావడం లేదన్నారు. వైసీపీ నాయకులు తనను ఎన్నికల్లో ఎదుర్కొనలేక తెరచాటున జరిపిన రాజకీయాలతో టీడీపీ, బీజేపీ పెద్దలను తప్పుదారి పట్టించారన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని కోరారు.

నేటి నుంచి కుటుంబంతో కలిసి గ్రామాల్లో పర్యటిస్తా : రామకృష్ణారెడ్డి

అనపర్తి అసెంబ్లీ టిక్కెట్‌ను తనకు కేటాయించి ఇప్పుడు బీజేపీకి మార్చడం వెనుక పెద్ద కుట్ర జరిగిందని.. దీనిపై ప్రజలు, కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నుంచి ఐదు రోజులపాటు తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రజల్లోకి వెళతానని, మహేంద్రవాడ గ్రామం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభిస్తానని నల్లమిల్లి చెప్పారు.

నల్లమిల్లిని బుజ్జగించే ప్రయత్నం చేసిన చంద్రబాబు

అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సీటును టీడీపీ నుంచి బీజేపీకి మార్పుచేసిన నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లు చేస్తున్న ఆందోళనలకు చివరకు చంద్రబాబు స్పందించారు. గురువారం చంద్రబాబు నల్లమిల్లికి ఫోన్ చేసి బుజ్జగించే ప్రయత్నంచేశారు. నల్లమిల్లి మాత్రం అనపర్తిలో జరుగుతున్న పరిణామాలు అన్ని మీకు తెలిసినవేనని, ఇలా చేయడం అన్యాయమని అధినేత వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీ కోసం ప్రాణాలొడ్డి పోరాడితే నన్ను బలి చేశారంటూ ఆవేదన చెందారు. మీకోసం తెగించి పోరాటం చేసిన అతికొద్ది మందిలో నేనూ ఒకడినని అన్నారు. నాడు వైఎస్ఆర్ పిలిచినా తమ కుటుంబం పార్టీ మారలేదని, 40 ఏళ్లుగా మూలారెడ్డి కుటుంబం మీ వెంటే నడిచిందని నల్లమిల్లి అధినేత వద్ద వాపోయారు. అనపర్తిలో తెలుగుదేశం ఉనికిని ప్రమాదంలో పడేసింది మీరేనని, దానికి కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మీపైనే ఉందని చంద్రబాబుకు చెప్పినట్టు రామకృష్ణారెడ్డి మీడియాకు తెలిపారు. రాజకీయ పరిణామాలతో అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి, రామకృష్ణారెడ్డి మాతృమూర్తి సత్యవతి భావోద్వేగానికి లోనై కంటితడి పెట్టారు. 42 ఏళ్లుగా తమ కుటుంబం తెలుగుదేశం పార్టీతోనే ప్రయాణం సాగిస్తోందని, తన భర్త, కుమారుడు నిత్యం ప్రజాసేవే పరమావధిగా ఉన్నారని, ఇప్పుడు తమ కుటుంబానికి సీటు లేదనడం భావ్యం కాదంటూ ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.



రామవరం వచ్చిన కార్యకర్తలతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి



టీడీపీ కరపత్రాలు, జెండాలను దహనం చేస్తున్న పార్టీ శ్రేణులు



నల్లమిల్లి కోసం రూ.1 కోటి ఆస్తి ధారాదత్తానికి సిద్ధం



డాక్యుమెంట్లతో వచ్చిన సిరసపల్లి కుటుంబీకులు

అనపర్తి అసెంబ్లీ నుంచి రామకృష్ణారెడ్డి పోటీ చేయాలని, ఆయన విజయానికి ఏ త్యాగం చేయడానికైనా తమ కుటుంబం సిద్ధంగా ఉందని అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామానికి చెందిన సిరసపల్లి రమణమ్మ కుటుంబం పేర్కొంది. నల్లమిల్లి నివాసానికి వచ్చిన వారు తమ కూడా తెచ్చిన రూ.1 కోటి విలువైన ఆస్తి డాక్యుమెంట్లను చూపుతూ రామకృష్ణారెడ్డి విజయం కోసం తమ ఆస్తిని ధారాదత్తం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రమణమ్మ వెంట ఆమె తనయుడు సిరసపల్లి చంద్రశేఖర్, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నల్లమిల్లికి బీవీఆర్ పరామర్శ



అనపర్తి అసెంబ్లీ టిక్కెట్టును బీజేపీకి మార్పు చేయడంతో అనపర్తిలోని టీడీపీ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్న తరుణంలో గురువారం మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసానికి చేరుకున్న రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి నల్లమిల్లిని పరామర్శించి సంఘీభావం ప్రకటించారు.

గుడ్ ఫ్రైడే..

\- అనపర్తి




గుడ్ ఫ్రైడే సందర్భంగా అనపర్తిలోని సత్య డ్రాయింగ్ అకాడమీకి చెందిన విద్యార్థి పైడిమళ్ల రాజు చిత్రీకరించిన చిత్రపటం ఇది. దేశంలోని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలపాలన్న సంకల్పంతో రాజు పెన్సిల్, వాటర్ కలర్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాడు. రాజును అకాడమి చైర్మన్ మందపల్లి సత్యానందం తదితరులు అభినందించారు.

వారాహి వస్తోంది..

ఎన్నికల శంఖారావం పూరించడానికి





- రేపు సాయంత్రం చేబ్రోలులో సభ
- ఆ రోజు ఉదయమే పిఠాపురానికి పవన్

పిఠాపురం, మార్చి 28: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తన ప్రచారానికి ఈనెల 30వ తేదీన శ్రీకారం చుట్టనున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి వారాహి విజయభేరి మోగించనున్నారు. ఆ రోజు సాయంత్రం 4గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు రామాలయం సెంటర్‌లో జరిగే సభలో వారాహి వాహనంపై నుంచి పవన్ ప్రసంగించనున్నారు. పవన్‌కల్యాణ్ తాను పోటీ చేయనున్న పిఠాపురం నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్టు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారికంగా సమాచారం అందింది. ఆ మేరకు పార్టీ నాయకులు అనుమతులు కోసం పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వోకు, పోలీసులకు గురువారం సాయంత్రం దరఖాస్తు చేశారు. 30వ తేదీన హెలికాప్టర్‌లో పవన్‌కల్యాణ్ గొల్లప్రోలు పట్టణ శివారులోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి పుర్హుతికాశక్తి పీఠానికి చేరుకుని వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. దత్త పీఠాన్ని దర్శించుకుంటారు. అనంతరం పిఠాపురం మండలం కుమారపురంలోని ప్రైవేటు హోటల్‌కు చేరుకుని అక్కడ బసచేసి సాయంత్రం వారాహి వాహనంపై గొల్లప్రోలు మండలం చేబ్రోలు చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. సాయంత్రం 4గంటలు నుంచి జరిగే వారాహి విజయభేరి యాత్రలో పాల్గొని సభకు హాజరయిన వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని కేంద్ర కార్యాలయం నుంచి సూచనలు జారీ కావడంతో ఏర్పాట్లు చేయడంలో జనసేన నాయకులు నిమగ్నమయ్యారు. కాగా పవన్ రాష్ట్రవ్యాప్త ప్రచారానికి వినియోగించే వారాహి వాహనం గురువారం రాత్రి కాకినాడ చేరుకుంది.

అబ్బురపరిచాయి

రెండో రోజూ కొనసాగిన నావికాదళ విన్యాసాలు



సర్పవరం జంక్షన్, మార్చి 28: కాకినాడ సాగరతీరంలో సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత్ త్రివిధ దళాలు-అమెరికా యాంఫీబీయాస్ టైగర్ ట్రయంఫ్-2024 సైనిక విన్యాసాలు రెండో రోజు గురువారం కూడా కొనసాగాయి. ఎక్స్ టైగర్ ట్రయంఫ్ సీ ఫేజ్‌లో భాగంగా యుద్ధ సమయంలో శత్రువులపై ఆకాశం, భూభాగం, సముద్రం పై నుంచి త్రివిధ దళాలు జరిపే పోరాటం, యుద్ధ నైపుణ్యాల ప్రదర్శన, యుద్ధ ట్యాంకర్లు, యుద్ధ నౌకలు, ఆయుధాల వినియోగం, హెలికాప్టర్ల ద్వారా శత్రువుల శిబిరాలపై దాడులు చేశారు. బంకర్లలో ఆర్మీ సిబ్బంది ఆయుధాలతో జల, భూ ఉపరితలం, ఆకాశమార్గాల ద్వారా శత్రువుల శిబిరాలపై ఫిరంగులు, బాంబులతో బాంబుల మోత మోగించారు. ఈ యాంఫీబీయాస్ విన్యాసాలు ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో రాకపోకలు నిషేధించామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనదారులు వెళ్లాలని కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె. శ్రీనివాస్ కోరారు.



'షాలిమార్'లో సాంకేతిక లోపం

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో నిలిపివేత
ఐదు గంటలకు పైగా ప్రయాణికులకు నరకం



నిలిచిపోయిన ఎక్స్‌ప్రెస్



అధికారులతో వాగ్వాదం

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): షాలిమార్- సికింద్రాబాద్ వారాంతపు రైల్లో (నెం.22849) సాంకేతిక లోపం ఏర్పడి రాజమండ్రి రైల్వే స్టేషనులో 5.30 గంటలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. సికింద్రాబాద్ వెళ్తున్న రైలుకు కడియం రైల్వే స్టేషను దాటిన తర్వాత రైలు బోగీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులు రైలును నెమ్మదిగా రాజమండ్రి తీసుకొచ్చి రెండో ప్లాట్‌ఫాం వద్ద నిలిపారు. వెంటనే రైల్వే ఎలక్ట్రికల్ తదితర విభాగాల సిబ్బంది రంగంలోకి దిగి లోపాన్ని గుర్తించే పని చేపట్టారు. ఇంజన్‌లో లోపం ఉందనుకొని వేరొక ఇంజను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. ముందువైపు ఉన్న జనరేటర్ బోగీ (పవర్ కార్)లో లోపం తలెత్తిందని గుర్తించారు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వెనుక కూడా వేరొక ఇంజను అమర్చి- వెనుక ఉన్న పవర్ కార్ ద్వారా విద్యుత్తు సరఫరా చేశారు. దీంతో ఉదయం 7.30గంటలకు వచ్చిన రైలు మధ్యాహ్నం 1గంటలకు బయలుదేరింది. అప్పటికే ఈ రైలు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తుండడం గమనార్హం.

● ప్రయాణికులకు నరకం

రైలుకు 19బోగీలు ఉండగా అందులో 12 ఏసీ బోగీలు ఉన్నాయి. మొత్తం అన్ని బోగీల్లోనూ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఏసీలు ఆగిపోవడంతో ఆ బోగీల్లోని ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. గాలి ఆడకపోవడంతో చిన్న పిల్లలు అవస్థలు పడ్డారు. సెల్‌ఫోన్లలో చార్జింగ్ అయిపోవడంతో ప్లాట్‌ఫాంపై ఉన్న సాకెట్లలో చార్జింగ్ పెట్టుకొన్నారు. కొన్ని బోగీల్లో నీటి సరఫరా కూడా ఆగిపోయింది. ప్యాంట్రీ కార్ (వంట బోగీ)లో కూడా విద్యుత్ నిలిచిపోవడంతో టీ తయారు చేయడానికి కూడా వీలు లేకుండా పోయింది. గంటల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు సహనం కోల్పోయారు. రెండో ప్లాట్‌ఫాంపై ఉన్న స్టేషను మాస్టారు గది వద్ద గుమిగూడి అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ బంధువు హార్ట్ పేషెంట్ అని, అన్ని గంటలు ఏసీలు ఆగిపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారంటూ ఓ మహిళ స్టేషను మాస్టారు వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఎస్ఐ లోవరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. స్టేషను మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కల్యాణ్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ సురేంద్ర, లోకో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

కవలగొయ్యిలో వ్యక్తి హత్య

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అతని తల్లి పలుకూరి సరోజిని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ కవలగొయ్యి ప్రాంతానికి చెందిన సరోజిని చిన్న కుమారుడు భాస్కరరావు(35)కు సత్యవాణితో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. తర్వాత మనస్పర్థల వల్ల 12 ఏళ్ల క్రితమే కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. దీంతో భాస్కరరావు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. అదే ప్రాంతంలో పాత ఇనుము వ్యాపారం చేసే గుజ్జు లక్ష్మి భర్తతో గొడవల వల్ల ఐదేళ్ల నుంచి విడిగా ఉంటోంది. భాస్కరరావుకు ఆమెతో పరిచయం ఏర్పడి మూడున్నరేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నాడు. ఈ మధ్య భాస్కరరావును ఇంటికి రావద్దంటూ లక్ష్మి దూరం పెట్టింది. దీంతో అతడు తాగుడుకు బానిసయ్యాడు. ఇదిలా ఉండగా.. భాస్కరరావుతో కందిరెల్లి నారాయణమూర్తి అనే వ్యక్తి కొన్ని రోజులుగా పరిచయం పెంచుకున్నాడు. అతడితో లక్ష్మికి పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో భాస్కరరావును నారాయణమూరి లక్ష్మీనగర్‌లో ఉన్న గంగుల సూర్యనారాయణ లేఅవుట్ దగ్గరలో వాచ్‌మన్ నివాసం ఉండే పాక వద్దకు తీసుకెళ్లి మందు తాగించాడు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో తన వెంట తెచ్చుకున్న కత్తితో భాస్కరరావును పొడుస్తుండగా వాచ్‌మన్ చూసి పారిపోయాడు. గురువారం ఉదయం తన వద్దకు వచ్చి వాచ్‌మన్ విషయం చెప్పగా అక్కడకు వెళ్లి చూడగా తన కొడుకు భాస్కరరావు రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడని సరోజిని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న విధ్వంసకర, అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదలు నిలువునా వంచింపబడుతున్నారని, ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని పేర్కొన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో రాజమండ్రి పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, అసెంబ్లీ వారీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, కోర్ కమిటీ, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండలం అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పురందేశ్వరితో పాటు బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే పోలీసు కేసులు నమోదు చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని మార్చడానికి చూపుడువేలును ఉపయోగించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయాన్ని కూడా తనఖా పెట్టిన పరిస్థితి ఉందన్నారు. ఇసుక లేకపోవడం వల్ల రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారన్నారు. బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించలేదని, దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ కలగడంలేదని అన్నారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తరపున ఎవరు నిలబడినా అక్కడ నిలబడింది మోదీగానే భావించాలన్నారు. విశాఖ డ్రగ్స్ కేసులో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధంలేదని స్పష్టం చేశారు. సిద్ధార్థ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామని హామీ ఇస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థి శివరామకృష్ణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్, సాగి కాశీ విశ్వనాథరాజు, కోడూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



కొవ్వూరు, మార్చి 28: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (ఐజీ) జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. కొవ్వూరు టౌన్, రూరల్ పోలీసుస్టేషన్లు, డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో కలెక్టర్‌లు, ఎస్పీలను సమన్వయం చేసుకుని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యులలో ఇంతవరకు ఆరు జిల్లాల్లో 1842 ఎన్‌బీడబ్ల్యులు ఎగ్జిక్యూట్ చేశామన్నారు. జిల్లాలో వీఐపీలు, ప్రజా ప్రతినిధులు పర్యటించినప్పుడు భద్రతా పరంగా బందోబస్తు నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకుండానే డిసెంబరు నుంచి ఎన్ఫోర్స్‌మెంట్ అమలు ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఐడీ లిక్కర్, పులిసిన బెల్లపు ఊట, ఎన్‌డీపీఎల్ సీసాలు, టెట్రా ప్యాకెట్లు డీపీఎల్ (గంజాయి), ఎన్‌డీపీఎస్, క్యాష్, ప్రీసియస్ మెటల్, ఫ్రీ బీస్ తదితరాలకు చెందిన 7489 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 4067 మందిని అరెస్టు చేసి రూ.15,53,74,279 విలువ గల వాటిని సీజ్ చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావాన్ని తగ్గించడానికి చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి దాడులు మరింత తీవ్రతరం చేశామన్నారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సరళిపై పోలీసు సిబ్బందికి శిక్షణను అందజేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుంచి పోలింగ్ రోజు తీసుకోవలసిన భద్రతా పరమైన చర్యలు, కౌంటింగ్ సమయంలో ఏ విధమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలనే అంశాలపై పోలీసు సిబ్బందికి శిక్షణను అందజేస్తున్నామన్నారు. పోలీసు సిబ్బంది ఎటువంటి తప్పులు చేయకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ పి.జగదీష్, డీఎస్పీ కేసీహెచ్ రామారావు,సీఐలు వి.జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి అధికారుల హామీ

వంతుల వారీ విధానం లేకుండానే బీడు భూములకు నీరివ్వాలని నిర్ణయం



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

తాళ్లరేవు, మార్చి 28: వంతుల వారీ విధానంతో ఎటువంటి సంబంధం లేకుండా గ్రాంటు ప్రాంతంలో వరిచేలకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు హామీ ఇచ్చారు. 'వరిచేలో రయ్ రయ్, బీడుబారిన వరిచేలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారుల బృందం గ్రాంటు ప్రాంతానికి కదలింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటులో ఎండిన వరిచేలు, ద్విచక్ర వాహనాలు తిప్పిన వరిచేలను ఇరిగేషన్ అధికారుల బృందం పరిశీలించింది. ముందుగా ఇరిగేషన్ అధికారి, సిబ్బందితో కారులో సర్వే చేసి రైతులకు ఏ సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడంతో రైతులు ఆగ్రహించి రోడ్డుపై పురుగు మందుల డబ్బాలను పట్టుకుని రాస్తారోకో నిర్వహించారు. సాగునీరు ఇస్తారా.. పురుగుల మందు తాగమంటారా అంటూ రైతులు నినాదాలు చేశారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్, ఈఈ రామకృష్ణ, ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ హిమరత్నం, ఏఈ ఈశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో రైతులు అధికారులను సాగునీరు ఇవ్వాలని నిలదీశారు. ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతుల ఇబ్బందులను వివరించి వారితో చర్చలు జరిపారు. ఈ రోజు నుంచి వంతులవారీ విధానంతో సంబంధం లేకుండా 15 రోజుల పాటు సాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామన్నారు. ఇంజన్లతో సాగునీరు కాలువలోకి డంప్ చేసి ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఓఎన్‌జీసీ ప్రతినిధులతో రైతుల సహకారంతో వినతిపత్రం అందించి సాగునీరు అందించే ప్రయత్నం చేస్తామన్నారు. దీంతో తాత్కాలికంగా రైతుల సమస్య పరిష్కారమైంది. కోరింగ ఎస్ఐ రవికుమార్, ఏఎస్ఐ సత్యనారాయణమూర్తి, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించి న్యాయం చేయాలి: దాట్ల బుచ్చిబాబు

గ్రాంటు రైతులకు సాగునీరు అందించి పంటనష్టపోకుండా చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో కోరారు. రైతులకు సాగునీరు అందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం, ఇన్సూరెన్స్ రాయితీలను అందివ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. వ్యవసాయ సాగు చేసే రైతులందరికీ మత్స్యకారుల తరహాలో పంట నష్టపరిహారాన్ని ప్రతి రైతుకు అందించేలా చర్యలు చేపట్టాలని రైతు ఎం.డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ ఎస్ఐపై దాడి

రోడ్డుపై వీరంగం సృష్టించిన మందుబాబులు
తీవ్రంగా గాయపడ్డ ఎస్ఐ ● ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన ఎస్ఐ



నిందితుడు కేశవ వీరంగం

కరప, మార్చి 28: కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంకలో గురువారం సాయంత్రం మందుబాబులు విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్.కిషోర్‌కుమార్ యానాం జాతీయ రహదారిపై ఉప్పలంక వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నారు. ఆ సమయంలో మోటర్‌సైకిల్‌పై అటుగా వెళ్తున్న పాలెపు రాజు అనే వ్యక్తిని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. అయితే బైక్ వెనుక ఉన్న అతని బావమరిది కర్రి కేశవ మద్యం మత్తులో ట్రాఫిక్ ఎస్ఐతో వాగ్వాదానికి దిగాడు. తన బావ రాజు మద్యం సేవించలేదని, ఖైనీ ప్యాకెట్ వేసుకుంటే మందు తాగినట్టు మిషన్ తప్పుగా చూపిస్తుందని ఎదురు తిరిగాడు. ఫూటుగా మద్యం సేవించి ఉన్మాద స్థితిలో ఉన్న కేశవ తన వొంటిపై ఉన్న చొక్కాను విప్పేసి పిచ్చి పిచ్చిగా అరుస్తూ ఊగిపోయాడు. పక్కనే దొరికిన పింగాణీ ముక్కను చేతిలోకి తీసుకుని దగ్గరికి వస్తే పీక కోసుకుంటానంటూ బెదిరించాడు. ఈ క్రమంలో పింగాణీ ముక్కతో ఎస్ఐపై దాడిచేశాడు. ఈ దాడిలో కిషోర్‌కుమార్ చెంపపై గాయమై తీవ్ర రక్తస్రావం అయ్యింది. ఈ హఠాత్పరిణామంతో భీతిల్లిన ట్రాఫిక్ సిబ్బంది అతికష్టంపై నిందితులను అదుపులోకి తీసుకుని కరప పోలీసులకు అప్పగించారు. నిందితుడు కర్రి కేశవ ఉప్పలంక గ్రామానికి చెందినవాడు కాగా ప్రస్తుతం పగడాలపేటలో ఉంటూ కాకినాడ ఫిషింగ్‌హార్బర్‌లో పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అతని బావ పాలెపు రాజుది అమలాపురం మండలం మామిడికుదురు (?)...

మాసంగితిప్ప శివారు బ్రహ్మసమాజం అని, అతను కూడా కాకినాడలో ఉంటున్నట్టు చెప్పారు. కేశవ తాత మూడురోజుల క్రితం చనిపోగా గురువారం ఉప్పలంకలో చిన్నదినం జరిగిందని, ఈ దినఖర్మకు వచ్చి బావ, బావమరిది ఫూటుగా మద్యం సేవించారని కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గాయపడిన ట్రాఫిక్ ఎస్ఐకి కరప పోలీస్‌స్టేషన్‌లోనే ప్రాథమిక చికిత్స చేయించి అనంతరం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులిరువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

అమలాపురం టౌన్, మార్చి 28: గత ఏడాది జరిగిన ఇంటి దొంగతనం కేసులో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 52 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు తెలిపారు. స్థానిక స్వామి వివేకానంద వీధిలో నివాసం ఉంటున్న పేరాబత్తుల రాధాకృష్ణ సెప్టెంబరు 8న హైదరాబాద్ వెళ్లగా ఇంటి తాళాలు పగులకొట్టి కనిపించాయని సమీప నివాసితులు అతనికి ఫోను చేశారు. వెంటనే తిరిగి వచ్చి ఫిర్యాదు చేయగా అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పటి సీఐ టి.క్రాంతి కుమార్ ఈ కేసులో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎ1 నిందితుడు ఈతకోట రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి 4.015 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఎస్పీ ఎస్.శ్రీధర్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తును వేగవంతం చేసి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన తానింకి నరేష్ (25), తమ్మినీడి షణ్ముఖమణి (31)ను అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ బుధవారం అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఎస్ఐ ఎన్ఆర్ కిశోర్‌బాబు, సీసీఎస్ సీఐ అబ్దుల్‌సలాంలను ఎస్పీ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

రూ.4.31 లక్షలు సీజ్

ఏలేశ్వరం, మార్చి 28: పత్రాలు చూపకుండా తీసుకెళ్తున్న రూ.4.31 లక్షలను గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. జగ్గంపేట మండలానికి చెందిన లోవరాజు ఈ సొమ్మును ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు.

జేఎన్టీయూకేలో ముగిసిన ఇన్నోవేషన్ ఫెయిర్

జేఎన్టీయూకే, మార్చి 28: జేఎన్టీయూకే వర్సిటీలో రెండు రోజులుగా డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ గురువారం ముగిసింది. సెనేట్ హాల్లో నిర్వహించిన ఇన్నోవేషన్ ఫెయిర్ ముగింపోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎస్టీ డైరెక్టర్ ఏ.గోపాలకృష్ణ, విశిష్ట అతిథులుగా డాక్టర్ కిషోర్‌కుమార్, జగన్‌మోహన్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ పరిశోధనల ప్రాజెక్టులు సాంకేతికంగా సహాయ పడతాయన్నారు. అలాంటి వారిని ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మార్చేందుకు తాము తోడ్పాటునందిస్తామన్నారు. అనంతరం నమూనాల ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను, కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీరవల్లి కళ్యాణ్ మనోహర్, డైరెక్టర్లు, అధ్యాపకులు, అను బంధ కళాశాలల పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కళా ప్రకర్షణ



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, మార్చి 28: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం వెండి ధ్వజస్తంభ కళాప్రకర్షణ శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 6 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధను నిర్వహించారు. ఉదయం 8.08 నిమిషాలకు ఆవు, దూడ సాయంతో ధ్వజ స్తంభం కదిలించి కళాప్రకర్షణ గావించారు. అనంతరం కళాప్రకర్షణ హోమం జరిపించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఐ.వి రోహిత్, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. చతుర్వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనివేటి మండపంలో కార్యక్రమాలు నిర్వహించడంతో గురువారం రూ.1500 వ్రతం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేశారు. వెండి ధ్వజస్తంభం స్థానంలో దాత సాయంతో బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు కానుంది. ఏప్రిల్ 18 నుంచి దీనికి సంబంధించి కార్యక్రమాలు ప్రారంభించి 22న నూతన బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన గావించనున్నారు. నెల్లూరుకు చెందిన ఒక దాత బంగారు ధ్వజస్థంభం ఏర్పాటుకు సుమారు 3.5 కోట్లు వ్యయం చేయనున్నారు.

స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఏవిధమైన శాఖాపరమైన సమీక్షలు గాని, తీర్మానాలు గాని ఆమోదించకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ముగించారు. గురువారం కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల చైర్మన్‌లు అధ్యక్షత వహించారు. 1,2,4,7 స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన నిర్వహించారు. అదే విధంగా 3వ స్థాయీ సంఘం సమావేశం జడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం స్థాయీ సంఘ ఛైర్‌పర్సన్ రొంగల పద్మావతి అధ్యక్షతన, 6వ స్థాయీ సంఘ సమావేశం జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాల్లో జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ సీఈవో జీఎస్ రాంగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమించాలి



చౌహాన్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్/(ఆంధ్రజ్యోతి), మార్చి 28: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని శ్రమించి చదువుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ చెప్పారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా ఆయన లాలాచెరువు హైస్కూల్‌ను, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ పనిచేసిన తత్వశాస్త్ర విభాగాన్ని, కందుకూరి వీరేశలింగం పనిచేసిన తెలుగు విభాగాన్ని ఆయన తిలకించారు. అలాగే ప్రాచీనమైన గ్రంథాలకు నిలయమైన కళాశాల గ్రంథాలయం, పురాతన పరికరాలున్న భౌతికశాస్త్ర యాంటిక్ ల్యాబ్‌ను, అంబేద్కర్ విగ్రహం, తరగతి గదులను శరత్ చౌహాన్ తన సతీమణితో కలిసి సందర్శించారు. ఆయన వెంట ఆర్డీవో చైత్రవర్షిణి, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సత్యవేణి, డిప్యూటీ ఈవో ఈవీవీబీఎన్ నారాయణ, ఎంఈవో దిలీప్‌కుమార్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీశైలశాస్త్రి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఏసు చిత్రం



రాయవరం, మార్చి 28: గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు ఇడుంగమిల్లి సౌదాసాగర్ గీచిన ఏసుక్రీస్తు చిత్రపటం పలువురిని ఆకట్టుకుంది. ఏసుక్రీస్తు శిలువకు వేలాడుతున్న దృశ్యంతో పాటు మరోవైపు రక్తం చిందిస్తున్న ఏసుప్రభు చిత్రపటాన్ని వివిధ రకాల రంగులతో చిత్రీకరించాడు. వివిధ రకాల వాటర్ కలర్స్‌తో ఈ చిత్రం రూపొందించినట్లు సౌదాసాగర్ తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

ఐదు తాటాకిళ్లు దగ్ధం

రూ.15 లక్షల ఆస్తి నష్టం



చింతూరు మార్చి 28: అల్లూరి జిల్లా చింతూరు మండలం మల్లెతోట గ్రామంలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఐదు తాటాకిళ్లతో పాటు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. కాకవారి గుంపులో కాక శిరమయ్య ఇంటికి తొలుత ప్రమాదవశాత్తు నిప్పంటుకుని, ఆ ఇంట్లోని వంట గ్యాస్ సిలిండర్ పేలి పక్కనే ఉన్న కాక ప్రసాద్, కాక సీతమ్మ, గొర్రె పిచ్చయ్య, ముచ్చిక మల్లయ్య, ముచ్చిక ముత్తమ్మ, ముచ్చిక బిగ్‌బాసుల ఇళ్లతో పాటు వంట ఇళ్లు, పశువుల పాకలు కాలిబూడిదయ్యాయి. బంగారం ఆభరణాలు, నగదు, గృహోపకరణాలు, ధాన్యం బస్తాలు, సర్టిఫికెట్లు దగ్ధమయ్యాయి. మొత్తం 15 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పీవో కావూరి చైతన్య వెంటనే సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యం, నిత్యావసరాలను అందజేశారు.

ఖాళీ బిందెలతో నిరసన



రాజవొమ్మంగి మార్చి 28: మండలంలోని జడ్డంగి చైతన్యనగర్‌లో తాగునీటి సమస్యకు సంబ ంధించి గ్రామస్థులు గురువారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గిరిజన నాయకుడు తెడ్ల రాం బాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు అధికారులకు హెచ్చరిక జారీ చేశారు. ఈ సందర్భంగా తెడ్ల రాంబాబు మాట్లాడుతూ చైతన్యనగర్ లో విద్యుత్ సరఫరా కోసం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా వాటిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక లోవోల్టేజీతో ఒక చేతి బోర్‌తోనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గత 10 రోజుల నుంచి అధికారులకు చెబుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే విద్యుత్ సమస్య పరిష్కరించి తాగునీటి సమస్యను తీర్చాలని లేనిపక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామస్థులు గూడెం లక్ష్మి, బచ్చల బేబి, గుర్రే మధుర వాణి, డబ్బా కోట దుర్గాదేవి, వీరకోట నారాయణమ్మ, ఒంటిపల్లి మంగ, పూసం లావణ్య, లోత రామలక్ష్మి, పూసం అన్నపూర్ణ, దల్లే ఆదిలక్ష్మి, దాకమురి లావణ్య, తొంట రమణ, బుడమ మణి, పసం లక్ష్మి ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

రంపచోడవరం, మార్చి 28: ఏజెన్సీ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలోని ఆయన చాంబరులో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో హ్యాండ్ బోర్లు మరమ్మతులకు లోనైతే వెంటనే రిపేరు చేయించాలన్నారు. హ్యాండ్ బోర్ల రిపేరుపై మండలాల వారీగా సమీక్షించారు. కాలువలు, చెలమల నీటిని వినియోగిస్తున్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, డీఈఈలు రాజేంద్రబాబు, శివ, ఎస్‌వో మార్తమ్మ, ఏడు మండలాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠ

మోతుగూడెం, మార్చి 28: మోతుగూడెం పరిధిలోని ఇంతులూరు వాగులో గురువారం రాధాకృష్ణ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వంతుల సుణామణి మాతాజీ దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు అయినవిల్లి కుమార్ స్వామి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును సుణామణి మాతాజీ అందించారు. ఒడిశా నుంచి రాధాకృష్ణుని భక్తులు వచ్చి మూడు రోజులు పాటు కృష్ణ నామాన్ని జపించారు. భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

31లోపు దరఖాస్తు చేసుకోవాలి

వై.రామవరం, మార్చి 28: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిమిత్తం ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల ప్రధానాచార్యులు శ్రీపాదరామకృష్ణ తెలిపారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోవడం కుదరదని ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివిన గిరిజన బాలబాలికలంతా ఈ ప్రవేశ పరీక్షకు అర్హులేనని తెలిపారు. పిల్లల ఆధార్, తల్లిపేరు, విద్యార్థి ఫొటో, సంతకం, కుల ధ్రువీకరణ పత్రం, ఫోన్ నెంబర్, గతంలో చదివిన పాఠశాల పేరు, చిరునామా వివరాలు అందజేయాలని సూచించారు.

ఓటర్లకు అవగాహన

రంపచోడవరం, మార్చి 28: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వో)ల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి చెప్పారు. ఫోక్సుపేట, ఎర్రంపాలెం, గోపవరం, ఐ.పోలవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ విఘ్నేష్, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నెల్లిపాక పీహెచ్‌సీ పరిశీలన

ఎటపాక, మార్చి 28: ఎటపాక మండలం, నెల్లిపాక పీహెచ్‌సీని గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు సందర్శించారు. పీహెచ్‌సీలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆరోగ్య భద్రతపై రోగులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు హెచ్‌బీ పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు కైలాష్, డీపీవో సతీష్, సీసీ మణికంఠ, వైద్యాధికారి ప్రత్యూష్, డాక్టర్ విష్ణుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

'కష్టపడిన వారికే టికెట్ ఇవ్వాలి'

ఎటపాక, మార్చి28: టీడీపీలో కష్టపడి పనిచేసిన వారికే రంపచోడవరం నియోజకవర్గ టికెట్ ఇవ్వాలని వంతల రాజేశ్వరికే అవకాశం కల్పించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వెల్లడించారు. గురువారం నెల్లిపాకలో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్ మాట్లాడుతూ వంతల రాజేశ్వరి గత ఏడేళ్ల నుంచి టీడీపీలో కష్టపడి క్యాడర్‌ను బలోపేతం చేశారని, ఇప్పుడు వేరే వారికి టికెట్ ఇవ్వడం సరి కాదన్నారు. అరకు పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, టీపీవీడు సర్పంచ్ మోసం రాజులు, మాచినేని రాజేష్ గొడేటి రవికుమార్, పెనుబల్లి సాయి, సబ్బినేని వేణు పాల్గొన్నారు.

కొత్తపల్లి గీత గెలుపునకు కృషి

రాజవొమ్మంగి మార్చి 28: అరకు పార్లమెంట్ బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా కొత్తపల్లి గీతను ప్రకటించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత గెలుపే లక్ష్యంగా కలిసి పనిచేయాలని జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, తెలుగుదేశం మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు అన్నారు.

కోటసత్తెమ్మ ఆలయ ఆదాయం రూ.22 లక్షలు

నిడదవోలు, మార్చి 28: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ దేవస్థానంలో గురువారం దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 10-01-2024 నుంచి 27-03-2024 వరకు 78 రోజులకు రూ.22,03,839 ఆదాయం లభించిందని అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. వీటితోపాటు అన్నదాన ట్రస్టుకు రూ.28,085, బంగారం 31 గ్రాములు, వెండి 254 గ్రాములు, యూఎస్ఏ 10 డాలర్ల నోటు 1, యూఎస్ఏ 1 డాలర్ల నోటు 1, యూఎస్ఈ 20 దినార్ల నోటు 1, యూఎస్ఈ 10 దినార్ల నోటు 1, యూఎస్ఈ 5 దినార్ల నోటు 1 లభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించేందుకు సిద్ధం



కోరుకొండ సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల బలరామకృష్ణ

» కూటమి రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల
» ఎంపీ భరత్‌రామ్‌కు ఓటమి భయం: వాసు

రాజానగరం/కోరుకొండ, మార్చి 28: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని జనసేన-టీడీపీ-బీజేపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని చక్రద్వారబంధం, ముక్కినాడ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు ఎంపీ హరేరామకృష్ణ, అనదాసు శేషయ్య, అనదాసు సాంబశివరావు, బి.శ్రీనివాస్, మహేష్, వినయ్, బి.శ్రీను, విజయకుమార్, వెంకటరమణ తదితరులు గురువారం జనసేనలో చేశారు. వారందరికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాటేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో భూషంశెట్టి అర్జున్, కురుమళ్ల మహేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బత్తుల మాట్లాడారు. రాజానగరం ప్రస్తుత ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు అడ్డె నియోజకవర్గమన్నారు. కొండలు, చెరువులు, ఇసుక, మట్టి దోచుకుపోవడం, నియోజకవర్గంలో బ్లేడ్‌బ్యాచ్, గంజాయి, క్రికెట్ బెట్టింగ్‌లను పెంచి పోషించడం అభివృద్ధి అంటారా అని బత్తుల ప్రశ్నించారు. ఎన్నికల ముందు డబ్బులు లేని వ్యక్తికి పదవి పూర్తయేటప్పటికి వందలాది ఎకరాలు, భవంతులు, తెలంగాణాలో లిక్కర్ సామ్రాజ్యం ఎక్కడదని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. పిల్లలు చదువులకు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. మహిళలందరికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. జనసేన నాయకులు కమిడి శ్రీరాం, మేడిశెట్టి శివరాం, అడపా శ్రీనివాస్, నాతిపాం దొరబాబు, బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలవబోతున్నాం: ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28: త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలుస్తున్నామని, నగర అభివృద్ధి ఎలా వుంటుందో చూపిస్తామని కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి పర్యవేక్షణలో వాసు.. బీజేపీ నాయకులు క్షత్రియ బాలసుబ్రహ్మణ్య సింగ్, కురగంటి సతీష్‌లతో కలిసి రాజమహేంద్రవరం 24వ డివిజన్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ 2019లో వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసు కొచ్చినందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయితే రాజమహేంద్రవరం ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారని, అందుకే ఎంపీ భరత్‌రామ్‌కు నగరంలో 28 వేల ఓట్లు మైనస్ వచ్చాయన్నారు. ఈ సారి ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు సిద్ధపడి చీరలు పంచుతున్నాడన్నారు. ప్రజలు కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కర్రి కాశి, కర్రి సూర్యనాయుడు, బెజవాడ వెంకటస్వామి, కర్రి గాయిత్రి, మిధున్, పుష్పరాజ్, రొక్క వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.. రాష్ట్ర ప్రజలు ఐదేళ్ల నలిగిపోయారని ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు చాలా కష్టాలు అనుభవించారని ఇక ఓపిక నశించి రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేందుకు ఓటు అనే ఆయుధాన్ని వినియోగించి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి పట్టం కట్టబోతున్నారన్నారు. జగన్ అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశాడని, రాష్ట్రంలో సుస్థిరమైన పాలన కోసం ప్రజలు కూటమిని గెలిపిస్తున్నారని చెప్పారు.



రాజమహేంద్రవరంలో ఇంటింట ప్రచారం చేస్తున్న ఆదిరెడ్డి వాసు

శివరామకృష్ణంరాజుకు టీడీపీ మద్దతు: నళినీకాంత్

రంగంపేట, మార్చి 28: టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ములగపాటి శివరామకృష్ణంరాజుకు మండల టీడీపీ పూర్తి మద్దతు ఉంటుందని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెండ్యాల నళినీకాంత్ (చిన్నారి) అన్నారు. గురువారం మండలంలోని వడిశలేరులో ఏర్పాటు చేసిన పాత్రికేయలు సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా ఆయనకు టీడీపీ టిక్కెట్ ఇస్తే సహకరించనన్నానని, అయితే అవి వ్యక్తిగత విభేదాలే తప్ప పార్టీతో ఎటువంటి విభేదాలు లేవన్నారు. తనకు పార్టీ ముఖ్యంగాని, వ్యక్తి ముఖ్యం కాదన్నారు. పార్టీ పెద్దలను, నాయకులను కలువుకొని శివరామకృష్ణంరాజు విజయానికి కృషి చేస్తానని చిన్నారి అన్నారు. అనంతరం వడిశలేరు నుంచి రంగాపురం వరకు బైక్‌లు, కార్లుతో ర్యాలీగా వెళ్లి శివరామకృష్ణంరాజుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా రాజమండ్రి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని రాజమహేంద్రవరంలో నళినీకాంత్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నళినీకాంత్

గోరంట్లను అఖండ మెజారిటీతో గెలిపించాలి: శిరీష

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 28: రాజమహేంద్రవరం 28వ వార్డులో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి మద్దతుగా ఆయన కుమార్తె కంఠంనేని శిరీష ప్రచారం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి శీలం గోవిందు ఆధ్వర్యంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ అధ్యక్షతన ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం కరపత్రాలను అందజేశారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీని నమ్మి మోసపోయిన ప్రజలు రానున్న ఎన్నికల్లో కూటమిని అధికారంలోకి తీసుకు వచ్చి గోరంట్లను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బంగారు రాజు, దండమూడి ప్రమీల, ముత్యాలబత్తుల విజయలక్ష్మి, బత్తుల విజయలక్ష్మి, మద్దా మని, బైరెడ్డి సరోజిని, కుంచే కుమారి పాల్గొన్నారు.



28వ వార్డులో ప్రచారం చేస్తున్న కంఠంనేని శిరీష

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి



కేక్ కట్ చేస్తున్న జవహర్

» వ్యక్తుల కోసం కాదు పార్టీ కోసం కట్టు బానిసలా పనిచేస్తా
» టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్

కొవ్వూరు, మార్చి 28: వ్యక్తుల కోసం కాదు పార్టీ కోసం కట్టు బానిసలా పనిచేస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ అన్నారు. మాజీ మంత్రి జవహర్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధిష్ఠానం నియమించడంతో గురువారం కొవ్వూరులో పార్టీ కార్యకర్తలు, నాయకులు సంబరాలు నిర్వహించారు. ఆయనను ఘనంగా సత్కరించారు. జవహర్ కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవిష్యత్ తరాల ఉనికి, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబు ముఖ్యమంత్రి కావలిసిన సందర్భంలో పొత్తులు వల్ల, స్థానిక పరిస్థితులతో కొన్ని ఇబ్బందులు వచ్చినప్పటికీ అందరూ త్యాగాలకు సిద్ధపడాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆ నిర్ణయం ప్రకారం కొన్నిచోట్ల ఇబ్బందులు వచ్చినప్పటికీ ప్రత్యేకంగా కొవ్వూరులో దేని వల్ల వచ్చిందో కొత్తగా చెప్పవలసిన అవసరం లేదన్నారు. ఆ ఇబ్బందులన్నిటినీ అధిగమిస్తూ చంద్రబాబుకు తనపై నమ్మకంతో పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారన్నారు. నియోజకవర్గంలో ప్రతిక్షణం తన వెన్నంటి ఉన్న మిత్రులు చూపించిన ప్రేమ కారణంగానే వేరే చోటికి వెళ్లలేకపోయానన్నారు. సీటు వచ్చినా రాకపోయిన ఇక్కడే ఉండాలనే దృఢ సంకల్పంతో పని చేశామన్నారు. ఎన్నికల వరకు ఒక రకంగా, అయిన తరువాత మరో రకంగా ట్రీట్ చేసిన సందర్భాలు ఉన్నాయని, అవి పునరావృతం కాకుడదన్నారు. టీడీపీకి కట్టు బానిసలా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాను తప్ప వ్యక్తులకు కాదన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ శ్రేణులకు అండగా ఇక్కడే ఉంటానన్నారు. ఎవ్వరి దగ్గరకు వెళ్లమని చెప్పడం, ప్రాధేయ పడమనడం ఉండదని, ప్రభుత్వం వచ్చిన తరువాత అందరి పనులు చేస్తానన్నారు. కార్యక్రమంలో వేగి చిన్నా, బూరుగుపల్లి రాఘవులు, కోడూరి ప్రసాద్, కరుటూరి సతీష్, బొడ్డు రాజు, పసలపూడి బోసు, నరసయ్య, పిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఎల్‌లో ముగిసిన ఫెన్సింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, మార్చి 28: యువజన, సాంస్కృతికశాఖ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎఫ్ఏఏపీ) ఆధ్వర్యంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు హోరాహోరీగా సాగిన 25వ జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు గురు వారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు వేడుకల్లో జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడా రంగాల్లో రాణిస్తూ భరతమాత గర్వించేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 10-14 ఏళ్ల వయస్సు కలిగిన 271 మంది బాలురు, 250 మంది బాలికలు ఉత్సాహంగా పాల్గొని పోటీ పడ్డారు. అనంతరం విజేతలకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు. పోటీల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందజేసిన జీఎస్ఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఏఏపీ రాష్ట్ర కార్యదర్శి జీఎస్వీ కృష్ణమోహన్, టీటీడీ శ్రీవాణి ట్రస్టు, జీఎస్ఎల్ సూపరింటెండెంట్ టీవీఎస్పీ మూర్తి, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ నాగం సతీష్‌బాబు, కోచ్‌లు, మేనేజర్లు, టెక్నీషియన్లు, ఫెన్సర్ల తల్లిదండ్రులు విచ్చేసి పోటీలను తిలకించారు.

లక్ష్మీగణపతికి ఎమ్మెల్యే దంపతులు పూజలు

బిక్కవోలు, మార్చి 28: బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో స్పీకర్ ఓఎస్‌డీ పడాల సత్యనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వంగా రామకృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జంగా గంగాధరరెడ్డి, గువ్వల సత్తిరెడ్డి, పాపదాసు మురళీ తదితరులు పాల్గొన్నారు.

మూలారెడ్డి సతీమణి భావోద్వేగం

అనపర్తి, మార్చి 28: అనపర్తి నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలతో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి, రామకృష్ణారెడ్డి మాతృమూర్తి సత్యవతి భావోద్వేగానికిలోనై కంటతడి పెట్టారు. 42 ఏళ్లుగా తమ కుటుంబం టీడీపీతోనే ప్రయాణం సాగిస్తోందని, తన భర్త, కుమారుడు నిత్యం ప్రజాసేవే పరమావధిగా ఉన్నారని, ఇప్పుడు తమ కుటుంబానికి సీటు లేదనడం బావ్యం కాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా అనపర్తిలో టీడీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్న తరుణంలో రామకృష్ణారెడ్డి నివాసానికి చేరుకున్న రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి ఆయనను పరామర్శించి సంఘీభావం ప్రకటించారు.

వైసీపీకి మద్దాల రమణ రాజీనామా



మీడియాతో మాట్లాడుతున్న గవర సంఘం ఉపాధ్యక్షుడు రమణ

కోరుకొండ, మార్చి 28: గవర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, శ్రీరంగపట్నం సర్పంచ్ భర్త, వైసీపీ నాయకుడు మద్దాల రమణ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు గురువారం రాత్రి ప్రకటించారు. మండలంలోని శ్రీరంగపట్నంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అత్యధిక జనాభా ఉన్న శ్రీరంగపట్నం గ్రామానికి ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయానని, సర్పంచ్ ఎన్నికల్లో పేదలకు ఇచ్చినమాటను నిలబెట్టుకోలేకపోయామని ఆవేదన చెందారు. వైసీపీ పాలనలో గ్రామస్థాయి నాయకులకు విలువ లేకుండా పోయిందన్నారు. త్వరలో తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరనున్నట్టు ప్రకటించారు. సమావేశంలో టీడీపీ నాయకుడు మందపాక వెంకట్రాజు, శరకణం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తితోనే భగవంతుడి ప్రసన్నం



సందీప్‌శర్మను సత్కరిస్తున్న మదన గోపాలస్వామి

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 28: భక్తితోనే భగవంతుడు ప్రసన్న మౌతాడనే విషయం ప్రహ్లాద చరిత్రతో అర్థమౌతుందని ప్రవచన బాదరాయణి, శతావధాని తాతా సందీప్‌శర్మ అన్నారు. రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని శ్రీవేంకటేశ్వర ఫైనాన్స్ వద్ద శ్రీ షిరిడి సాయి మందిరంలో ద్వాదశ కుంభాభిషేక మహోత్సవాలు గురువారం ముగిసాయి. మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిగింది. కార్యక్రమాలను ఐదు రోజుల పాటు శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాల స్వామి నిర్వహించారు. అనంతరం తణుకు శివానంద్ శిష్య బృందం శృతి లయ ఆర్ట్స్ అకాడమీ ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం అలరించింది.

ప్రాచీన ఆలయాల ఆదాయం రూ. 12.72 లక్షలు



బిక్కవోలు, మార్చి 28: బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వర, లక్ష్మీగణపతి ఆలయాల హుండీలను రామచంద్రపురం దేవదాయశాఖ తనిఖీ అధికారి ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో గ్రామ పెద్దల సమక్షంలో గురువారం లెక్కించారు. లక్ష్మీగణపతి హుండీ ఆదాయం రూ. 9,73,964, గోలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2,98,985 వచ్చిందని ఆలయాల ఈవో ఆర్.రాంబాబురెడ్డి తెలిపారు. గత యేడాది డిసెంబరు 13వ తేదీ నుంచి గురువారం వరకూ భక్తులు స్వామి వార్ల హుండీల్లో వేసిన కానుకలను లెక్కించినట్టు ఆయన తెలిపారు.

కోరుకొండ సొసైటీ మహాజన సభ

కోరుకొండ, మార్చి 28: కోరుకొండ వ్యవసాయ సొసైటీ లాభాల బాటలో పయనిస్తోందని, సంఘం ద్వారా రైతులకు రూ.9 కోట్లు రుణాలు ఇచ్చామని, జూన్ నాటికి మరో రూ.9 కోట్లు కొత్త రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చైర్మన్ మారిశెట్టి తేజో వీరన్ననాయుడు, సీఈవో జి.సుధాకర్ వర్మ పేర్కొన్నారు. కోరుకొండ సొసైటీ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం నిర్వహించిన మహాజన సభలో వారు మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సొసైటీ రూ.37.35 లక్షల లాభాల్లో ఉందన్నారు. రైతులకు రూ.5 కోట్లు కొత్త రుణాలుగా ఇచ్చామన్నారు. మరో రూ.16 కోట్లు దీర్ఘకాలిక రుణాలు అందించామన్నారు. రుణాలు తీసుకున్న రైతులందరూ సకాలంలో సక్రమంగా తిరిగి చెల్లించాలన్నారు. సమావేశంలో సొసైటీ చైర్‌పర్సన్ మల్లేశ్వరి, జాజుల నాగేశ్వరరావు, సొసైటీ సిబ్బంది ఆకుల వెంకటరమణ, గుగ్గిలం రవిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆలిండియా బెస్ట్ ఫిజిక్ ఛాంపియన్‌షిప్‌లో పవన్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి 28: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కీర్తిప్రతిష్ఠలు దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా విద్యార్థులు తయారుకావాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. కాలికట్‌లో గత నెల 2నుంచి 4వరకూ జరిగిన అఖిల భారత బెస్ట్ ఫిజిక్ ఛాంపియన్‌షిప్ +95 కేజీల కేటగిరిలో నన్నయ అనుబంధ కళాశాల కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన కోడూరి పవన్‌కుమార్ బంగారు పతకం కైవసం చేసుకున్నాడన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పవన్‌కుమార్‌ను ఆయన అభినందించి యూనివర్శిటీ తరపున రూ30,000 నగదును అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ 2022లో చండీఘడ్ విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో కాంస్యపతకం సాధించానని, ఈ ఏడాది బంగారు పతకం దక్కడం ఆనందంగా ఉందన్నారు. క్రీడా కోటాలో రైల్వే ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కృషిచేస్తున్నానన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు ఆచార్య పి.సురేష్‌వర్మ, క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్ పీడీ కె.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ, వెంకన్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ



కడియం, మార్చి 28: మండలం వీరవరంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మూడు రోజులుగా జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో మూడో రోజు వేదపండితుల విశ్వక్సేన ఆరాధన, మూలహోమం, పూర్ణాహుతి, విగ్రహ స్థాపన, జీవ కళాన్యాసము, గోదర్శనం, శాంతి కల్యాణం జరిగాయి. కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ శిల్పులకు, దాతలకు, పలువురు ప్రజాప్రతినిధులను ఆలయకమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

ఏప్రిల్ 26 నుంచి ఉచిత వేసవి శిక్షణా శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28: రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో ఏప్రిల్ 26వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకూ ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని స్కూల్ చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి వెల్లడించారు. గురువారం రాజమహేంద్రి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ శిబిరానికి హాజరుకావచ్చన్నారు. రోబోటిక్స్, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్, హ్యాండ్ రైటింగ్, కిక్ బాక్సింగ్, కరాటే, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్, మ్యూజిక్, వెస్టర్న్ డ్యాన్స్, హార్స్ రైడింగ్, రైఫిల్ షూటింగ్, స్కేటింగ్, ఆర్చరీల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7:30 నుంచి 11.30 గంటల వరకూ శిక్షణ ఉంటుందని, శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు నామమాత్ర ఫీజుతో బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.


రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్ర) సా.6.24
సహరి (శని) ఉ.4.38

ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	24.0

ఇక యుద్ధమే..

ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు | ఆరని అసమ్మతి సెగలు







జిల్లాలో ఎన్నికల యుద్ధం మొదలైంది. ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తుతో కొందరు సీనియర్ నేతలకు న్యాయం జరగలేదు. కానీ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న అధికార వైసీపీని గద్దెదించడం, రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడడం, ప్రజలకు శాంతిభద్రతలు కల్పించడమే లక్ష్యాలుగా ఏకమైన ఈ కూటమి వల్ల కొందరు త్యాగాల తప్పవని, వారందరికీ అధికారంలోకి రాగానే స్థాయికి తగ్గని విధంగా హోదా కల్పిస్తామనే హామీలు ఇస్తూ, బుజ్జగిస్తూ పార్టీలు ముందుకుపోతున్నాయి. వైసీపీ కూడా మొత్తం అభ్యర్థులను ఖరారుచేసింది. కానీ వారిలో గ్రూపులు పెరుగుతూనే ఉన్నాయి. అసమ్మతి ఆరలేదు. సుమారు 20 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. వచ్చే నెల అంటే ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పటి నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. 29తో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది. మే 13న పోలింగ్. ఇప్పటివరకూ చాలారోజులు ఉన్నాయిలే అనుకున్నారు.. కానీ కౌండ్‌డౌన్ మొదలైంది. రోజులు చకచకా మారిపోతున్నాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉండగా టీడీపీ-జనసేన- బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, రెండు అసెంబ్లీ స్థానాల్లో జనసేన, పార్లమెంట్‌తోపాటు ఒక అసెంబ్లీ స్థానంలో బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని టీడీపీ తొలి జాబితాలోనే అనపర్తి అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, అనూహ్యంగా బీజేపీ కోటాలోకి పోయింది. ఇక రాజమహేంద్రవరం సిటీ, రూరల్, గోపాలపురం, కొవ్వూరు స్థానాల నుంచి టీడీపీ, నిడదవోలు, రాజానగరం నుంచి జనసేన ఉమ్మడి అభ్యర్థులను పోటీపెట్టగా, రాజమహేంద్రవరం లోక్‌సభ, అనపర్తి అసెంబ్లీ స్థానాల నుంచి బీజేపీ అభ్యర్థులు ఖరారయ్యారు. గత శనివారం వైసీపీ కూడా తమ అభ్యర్థులను ప్రకటించింది. వైసీపీలో ఎస్సీ, బీసీ అభ్యర్థుల అసెంబ్లీ స్థానాలను బదిలీ చేయడంతో ఆయా వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. ఈసారి జిల్లాలో టీడీపీ-జనసేన, బీజేపీ కూటమి నుంచి సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, గోపాలపురం టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, అనపర్తి నుంచి ఎం. శివకృష్ణంరాజు తొలిసారి ఎన్నికల బరిలోకి వచ్చారు. వాసు, వెంకట్రాజు విద్యావంతులు కాగా, బలరామకృష్ణ వ్యాపారి, ఆధ్యాత్మికవేత్త. కృష్ణంరాజు ఎక్స్ మిలట్రీ మ్యాన్. ఇక నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన నాయకుడు. రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి సిట్టింగ్ ఎమ్మెల్యే కూడా. కొవ్వూరు టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు గతంలో గోపాలపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేశారు. కూటమి ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి ఎన్టీఆర్ కుమార్తె. కేంద్రమంత్రిగానూ పనిచేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు. ఇక వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ రాజకీయాలకు పూర్తిగా కొత్త. ఆయన డాక్టర్. అనుకోకుండా ఎంపీ బరిలోకి దిగారు.

• రాజమహేంద్రవరం సిటీలో వాసు వర్సెస్ భరత్

రాజమహేంద్రవరం సిటీలో టీడీపీ అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసు, వైసీపీ అభ్యర్థిగా ఎంపీ మార్గాని భరత్ పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. ఇది టీడీపీకి కంచుకోట. 2019లో వైసీపీ గాలి వీచిన సమయంలో కూడా ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసు సతీమణి ఆదిరెడ్డి భవానీ గెలిచారు. పైగా ఇప్పుడు వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈనేపథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసు బలంగా జనంలోకి వెళుతున్నారు. వైసీపీలో గ్రూపులెక్కువ. గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా రౌతు సూర్యప్రకాశరావు పోటీచేసి ఓడిపోయారు. వైసీపీ సీనియర్ నేతలను పక్కన పెట్టారన్న అసంతృప్తి ప్రస్తుత సిటీ అభ్యర్థి భరత్‌కు తగలనుంది.

• రూరల్‌లో గోరంట్ల వర్సెస్ చెల్లుబోయిన

రాజమహేంద్రవరం రూరల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగగా, వైసీపీ అభ్యర్థిగా మంత్రి చెల్లుబోయిన వేణు రంగంలోకి దిగారు. కానీ ఆయనను రామచంద్రపురం నుంచి ఇక్కడకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. వైసీపీ కేవలం బలహీనవర్గాలనే ఒక నియోజకవర్గంలో ఉండనీయకుండా, ఇక్కడకు బదిలీ చేశారనే విమర్శ ఉంది. అంతేకాక గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ అభ్యర్థి ఆకుల వీర్రాజు పోటీ చేశారు. ఈసారి ఆయనకు సీటు దక్కలేదు. ఇక్కడ వైసీపీ కోఆర్డినేటర్‌గా కష్టపడిన చందన రమేష్‌ను పార్టీ అన్యాయం చేసిందనే వాదన కూడా ఉంది. ఇలా స్థానికంగా ఆ పార్టీ నేతల్లో గందరగోళం నెలకొంది. ఇక కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రెండు దఫాలుగా ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నారు. మూడోసారి ఇప్పుడు ఎన్నికలకు వెళుతున్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాలతోనూ మంచి సంబంధాలు ఉన్న నేతగా ఆయనకు పేరుంది.

• రాజానగరంలో బత్తుల వర్సెస్ జక్కంపూడి

రాజానగరంలో జనసేన తరపున కూటమి అభ్యర్థిగా బత్తుల బల రామకృష్ణ బరిలోకి దిగారు. ఇక్కడ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మరోసారి బరిలోకి దిగారు. ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన నేతలు. ఈసారి ఎలాగైనా గెలవాలని కూటమి అభ్యర్థి పనిచేస్తున్నారు. ఇక్కడ టీడీపీ టిక్కెట్టు ఆశించిన నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ పార్టీ ఆదేశాల మేరకు పనిచేయడానికి ముందుకురావడం కూటమికి కలిసొచ్చే అంశం. ఎక్కడా అసంతృప్తి లేకుండా కలసి ముందుకు సాగుతున్నారు.

• అనపర్తిలో కృష్ణంరాజు వర్సెస్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి నియోజకవర్గంలో బీజేపీకి అనూహ్యంగా సీటు లభించింది. ఇక్కడ టీడీపీ తొలి జాబితాలోనే టీడీపీ తరపున కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించగా, పొత్తు వల్ల ఈ సీటును బీజేపీ తీసుకుంది. తర్వాత రంగాపురానికి చెందిన ఎక్స్‌మిలట్రీ కృష్ణంరాజును అభ్యర్థిగా ప్రకటించింది. ఇది టీడీపీ కేడర్‌కు ఇబ్బంది. ఇక్కడ పరిస్థితులు ఎలా మారతాయో చెప్పలేని విధంగా ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి కృష్ణంరాజు ఇక రంగంలోకి దిగారు. ఆయనతో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తలపడనున్నారు. ఇక్కడ వైసీపీ మీద ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, అభివృద్ధి ఏమాత్రం లేకపోవడం వైసీపీకి మైనస్‌గా ఉన్నాయి.

• కొవ్వూరులో ముప్పిడి వర్సెస్ తలారి

కొవ్వూరు నియోజకవర్గంలో పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ కూడా గోపాలపురం నియోజకవర్గం నుంచి దిగుమతి అయినవాళ్లే. కానీ వీరిద్దరూ మూడు ఎన్నికల నుంచి ఒకరిపై ఒకరు పోటీ చేస్తున్నారు. 2014లో ముప్పిడి వెంకటేశ్వరరావు గెలవగా, 2019లో తలారి వెంకట్రావు గెలిచారు. ఈసారి కొవ్వూరు నుంచి టీడీపీ తరపున ముప్పిడి, వైసీపీ తరపున తలారి పోటీపడుతున్నారు. ఇక్కడ గెలిచి మంత్రి పదవి దక్కించుకుని, ఇవాళ గోపాలపురం బదిలీ అయిన తానేటి వనిత వైఖరి వల్ల వైసీపీ రెండుగా చీలిపోయింది. ఇక టీడీపీ అభ్యర్థి ముప్పిడిని ఓ ప్రధాన వర్గం కావాలని తీసుకొచ్చింది. టీడీపీ ద్విసభ్య కమిటీ కష్టపడి పనిచేస్తోంది. ఇక్కడ టిక్కెట్ ఆశించి భంగపడ్డ మాజీ మంత్రి జవహర్‌కు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో సానుకూలం వాతావరణం నెలకొంటోంది.

• గోపాలపురం నుంచి మద్దిపాటి వర్సెస్ మంత్రి తానేటి

గోపాలపురం ఎస్సీ నియోజకవర్గం నుంచి ఈసారి టీడీపీ తరపున కూటమి అభ్యర్థిగా విద్యావంతుడైన మద్దిపాటి వెంకట్రాజు రంగంలో ఉన్న సంగతి తెలిసిందే. ఆయన రాష్ట్ర హోంమంత్రి, వైసీపీ అభ్యర్థిని తానేటి వనితపై పోటీకి దిగారు. ఇక్కడ కూటమి బలంగా ఉంది. కానీ ఇక్కడ మద్దిపాటికి, మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపాటి బాపిరాజు వర్గం ఇంకా సహకరించడంలేదు. ఇటీవల కొందరు పెద్దలు జోక్యంచేసుకుని, అసమ్మతి బుజ్జగించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. వైసీపీ అభ్యర్థిని హోంమంత్రి తానేటి వనిత గతంలో కొవ్వూరు వ్యవహరించిన తీరు ఆమెను ఇంకా వెంటాడుతూనే ఉంది. అది ఆమెకు పెద్ద సమస్యే. వైసీపీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను అధిగమించి ఎన్నికల్లో ముందుకు సాగడం మరో సమస్య.

• నిడదవోలులో దుర్గేష్ వర్సెస్ శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా జనసేన తరపున మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడుపై పోటీపడుతున్నారు. ఇక్కడ టీడీపీకి టిక్కెట్ రాకపోవడంతో ఏర్పడిన అసంతృప్తి కూడా చల్లారిందని భావిస్తున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వర్గం మొదట జనసేన అభ్యర్థిని వ్యతిరేకించినా, చంద్రబాబుతో శేషారావు భేటీ అయిన తర్వాత సమస్య సద్దుమణిగింది. కూటమి అభ్యర్థి దుర్గేష్ కోసం శేషారావు కలిసి పనిచేస్తున్నారు. తెలుగుదేశం, జనసేన శ్రేణులు ప్రతి గ్రామంలో కలసి పనిచేసేలా ముందుకు సాగుతున్నారు. అయితే తెలుగుదేశంలో మరొక వర్గం మాత్రం అలక వహించింది. ఇక్కడ శేషారావుతోపాటు టిక్కెట్ ఆశించిన సీనియర్ నేత, వ్యాపారవేత్త కుందుల సత్యనారాయణ.. జనసేన అభ్యర్థిని ప్రకటించిన వెంటనే ఆయన స్వాగతించారు. చంద్రబాబు సీఎం కావడమే తన లక్ష్యమని, ఎవరికి సీటిచ్చినా తనకు అభ్యంతరం లేదని బహిరంగంగా ప్రకటించారు. కానీ గురువారం ఆయన, తన అనుచరుల్లోని ముఖ్యులతో సమావేశమయ్యారు. ఇంతవరకూ ప్రచారంలోకి కుందులను ఆహ్వానించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం.


పురందేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్, ఇతర నేతలు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- కూటమి అధికారంలోకి రావడం చారిత్రక అవసరం
- ప్రభుత్వాన్ని మార్చడానికి చూపుడు వేలుని వినియోగించండి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపు - 8లో


చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ జగదీశ్, పోలీసు అధికారులు

సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఎస్పీ ఆకస్మిక తనిఖీ

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. నిఘా కెమెరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయడం ఆగరాదని పేర్కొన్నారు. వాటి ఫుటేజీని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటామని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్పీ పోలీసు సిబ్బందిని హెచ్చరించారు. గోకవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణునిపాలెం వద్ద ఏర్పాటుచేసిన సరిహద్దు చెక్‌పోస్టును ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని వాహనాలను ఆయనే స్వయంగా పరిశీలించారు. సిబ్బంది తనిఖీ చేస్తున్న తీరును గమనించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, అక్రమ నగదు తదితర వాటిని నిబంధనల ప్రకారం అడ్డుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. వాహనాలను పరిశీలించే సమయంలో డ్రైవర్లు, ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ ఆదేశించారు. చెక్‌పోస్టు, సిబ్బంది మోహరింపు, తనిఖీల గురించి ఎస్పీకి గోకవరం ఎస్ఐ కె.నాగరాజు వివరించారు.

తగ్గిపోతున్న గోదావరి నీటిమట్టం

- ధవళేశ్వరం వద్ద రూ7.60 అడుగులకు నీటి మట్టం
- మూడు డెల్టాలకు మొత్తం 8,970 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, మార్చి 28: గోదావరిలో ఇన్‌ఫ్లో తగ్గుతూ ఉండడం, బేసిన్‌లో నిల్వచేసిన నీటిని వ్యవసాయావసరాలకోసం డెల్టా కాలువలకు విడుదల చేస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం నాటికి నీటిమట్టం 8.55 అడుగులు ఉండగా గురువారం సాయంత్రానికి 7.60 అడుగులకు చేరుకుంది. పాండ్ లెవెల్ 12.99 మీటర్లుగా నమోదైంది. నీటి మట్టం ఆరు అడుగులకు తగ్గి పాండ్ లెవెల్ 12 మీటర్లకు పడిపోతే స్లూయిస్ గేట్ల ద్వారా డెల్టా కాలువల్లోకి ప్రవహించే నీటి ప్రవాహ వేగం మందగిస్తుంది. గురువారం ఉదయానికి నీటిమట్టం 7.90 అడుగులుగా ఉండగా, సాయంత్రానికి నీటి మట్టం మరింత తగ్గి 7.60 అడుగులుగా నమోదైంది. ఇదిలా ఉండగా సీలేరు నుంచి విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 3500 క్యూసెక్కులు గోదావరికి వచ్చి చేరుతుండగా గోదావరిలో మొత్తం నీటి లభ్యత 7838 క్యూసెక్కులుగా ఉంది. ఇదే సమయంలో డెల్టా కాలువల ద్వారా 8970 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అంటే గోదావరిలో నిల్వచేసిన నీటి నుంచి 1132 క్యూసెక్కులు అదనంగా విడుదల చేస్తున్నారు. మొత్తంగా చూస్తే తూర్పుడెల్టాకు 2650 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1720 క్యూసెక్కు లు, పశ్చిమ డెల్టాకు 4600 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తవ్వల వీరేంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా స్వర్ణపాప 69 ఓట్లతోను, ప్రధాన కార్యదర్శిగా పి.రమేశ్ 114, సంయుక్త కార్యదర్శిగా ధర్నాలకోట వెంకటేశ్వరరావు 447, కోశాధికారిగా కె.హనుమంతరావు 447, లైబ్రరీ కొత్తపల్లి శ్రీనివాస్ 138, స్పోర్ట్ కాశీ శ్రీనివాసరావు 81, మహిళా ప్రతినిధిగా కె.వరలక్ష్మి 88 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అసోసియేషన్‌లో 1200 మంది సభ్యులుండగా 866 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం ఉత్సాహంగా పోలింగ్ జరిగింది. రాత్రికి ఫలితాలు వెల్లడికాగా, న్యాయవాది కె.మల్లేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

భర్తపై ఇటుకతో దాడి.. మృతి

- భార్య, భర్త, కొడుకు ఘర్షణ
- కుమారుడిని కత్తితో పొడిచిన తండ్రి
- క్షతగాత్రులు ఆసుపత్రికి తరలింపు

ఉండ్రాజవరం, మార్చి 28: భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త మృతి చెందాడు. ఎస్ఐ వి.అప్పలరాజు వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన ఉండ్రాజవరంలోని రామకృష్ణనగర్‌లో ఉంటున్న గుల్లంకి వెంకట్, పార్వతిలకు 20 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా వెంకట్ స్వగ్రామం తాడేపల్లిగూడెంలోను, పార్వతి తన ఇద్దరు పిల్లలతో ఉండ్రాజవరంలో ఉంటున్నారు. తరచూ వెంకట్ ఉండ్రాజవరం వచ్చి తనతో రమ్మని గొడవ పడుతుండేవాడు. ఇటీవల కూతురు పెళ్లి కారణంగా పదిరోజులుగా ఇక్కడే ఉంటున్నాడు. బుధవారం రాత్రి పార్వతిని తనతో రమ్మని మళ్లీ గొడవపడ్డారు. వెంకట్‌కు భార్య కుమారుడితో తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వెంకట్.. కుమారుడు కృష్ణవంశీని కత్తితో పొడిచాడు. కుమారుడిని పొడిచాడన్న కోపంతో పార్వతి ఇటుకతో భర్తపై దాడిచేసింది. భార్య, కొడుకు ఇటుకతో తండ్రిపై తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. గాయపడిన భర్త, కొడుకును తణుకు ఆసుపత్రికి తీసుకువెళ్లింది. వెంకట్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు, అక్కడ నుంచి విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుమారుడు కృష్ణవంశీ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అప్పలరాజు తెలిపారు. కేసును సీఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వారాహి వస్తోంది..

• రేపు సాయంత్రం చేబ్రోలులో పవన్ సభ

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తన ప్రచారానికి ఈనెల 30వ తేదీన పిఠాపురం నియోజకవర్గం నుంచి వారాహి విజయభేరి మోగించనున్నారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు రామాలయం సెంటర్‌లో వారాహి వాహనంపై నుంచి ప్రసంగిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - పిఠాపురం

రామవరంలో రచ్చరచ్చ!

- అనపర్తి సీటును టీడీపీకి కేటాయించాలంటూ తెలుగుతమ్ముళ్ల డిమాండు
- పార్టీ జెండాలు, కరపత్రాలు దహనం
- ఆగని ఆందోళన


రామవరం వచ్చిన కార్యకర్తలతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి


టీడీపీ కరపత్రాలు, జెండాలను దహనం చేస్తున్న పార్టీ శ్రేణులు

అనపర్తి, మార్చి 28: అనపర్తి అసెంబ్లీ సీటును టీడీపీకి కాకుండా బీజేపీకి ప్రకటించడంతో గురువారం అనపర్తి మండలం రామవరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో తెలుగు తమ్ముళ్లు రచ్చరచ్చ చేశారు. సీటు మార్పు పట్ల చర్చ జరిపేందుకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశం రసాభాసాగా మారింది. నల్లమిల్లి ప్రసంగం ప్రారంభించగానే ఒక్కసారిగా నాయకులు, కార్యకర్తలు కట్టలు తెంచుకున్న ఆవేశంతో కార్యాలయంలోని టీడీపీ జెండాలను, కరపత్రాలను బయటకు తెచ్చి పెట్రోలు పోసి నిప్పంటించారు. మంటల్లో ఒక సైకిల్ వేసేందుకు ప్రయత్నం చేస్తున్న కార్యకర్తలను నల్లమిల్లి వారించారు. అనపర్తికి చెందిన ఓ కార్యకర్త.. నల్లమిల్లి నివాసంపైకి ఎక్కి అక్కడి నుంచి దూకుతానంటూ బెదిరించడంతో నల్లమిల్లి తనయుడు మనోజ్‌రెడ్డి చాకచక్యంగా అతడిరి ఒడిసి పట్టుకుని కిందకు దించారు. అలాగే గొల్లలమామిడాడకు చెందిన ఐదుగురు యువకులు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయడంతో వారిని కూర్చోబెట్టి నచ్చజెప్పారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని 40 ఏళ్లుగా ప్రయాణం చేస్తున్న నల్లమిల్లి కుటుంబాన్ని కాదని, అనపర్తిలో బీజేపీకి టిక్కెట్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అనంతరం మాట్లాడిన రామకృష్ణారెడ్డి తన ప్రసంగంలో భావోద్వేదానికి లోనయ్యారు. అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రాణాలను పణంగా పెట్టిన తనకు ఇంత అన్యాయం చేయడం తగదన్నారు. కష్టపడి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని గెలుపు దిశగా తీసుకువచ్చిన తరుణంలో బీజేపీకి కేటాయిస్తుంటే చంద్రబాబు ఎందుకు మౌనం వహించారో అర్థంకావడం లేదన్నారు. వైసీపీ నాయకులు తనను ఎన్నికల్లో ఎదుర్కొనలేక తెరచాటున జరిపిన రాజకీయాలతో టీడీపీ, బీజేపీ పెద్దలను తప్పుదారి పట్టించారన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని కోరారు.

నేటి నుంచి కుటుంబంతో కలిసి గ్రామాల్లో పర్యటిస్తా : రామకృష్ణారెడ్డి

అనపర్తి అసెంబ్లీ టిక్కెట్‌ను తనకు కేటాయించి ఇప్పుడు బీజేపీకి మార్చడం వెనుక పెద్ద కుట్ర జరిగిందని.. దీనిపై ప్రజలు, కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నుంచి ఐదు రోజులపాటు తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రజల్లోకి వెళతానని, మహేంద్రవాడ గ్రామం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభిస్తానని నల్లమిల్లి చెప్పారు.

నల్లమిల్లిని బుజ్జగించే ప్రయత్నం చేసిన చంద్రబాబు

అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సీటును టీడీపీ నుంచి బీజేపీకి మార్పుచేసిన నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లు చేస్తున్న ఆందోళనలకు చివరకు చంద్రబాబు స్పందించారు. గురువారం చంద్రబాబు నల్లమిల్లికి ఫోన్ చేసి బుజ్జగించే ప్రయత్నంచేశారు. నల్లమిల్లి మాత్రం అనపర్తిలో జరుగుతున్న పరిణామాలు అన్ని మీకు తెలిసినవేనని, ఇలా చేయడం అన్యాయమని అధినేత వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీ కోసం ప్రాణాలొడ్డి పోరాడితే నన్ను బలి చేశారంటూ ఆవేదన చెందారు. మీకోసం తెగించి పోరాటం చేసిన అతికొద్ది మందిలో నేనూ ఒకడినని అన్నారు. నాడు వైఎస్ఆర్ పిలిచినా తమ కుటుంబం పార్టీ మారలేదని, 40 ఏళ్లుగా మూలారెడ్డి కుటుంబం మీ వెంటే నడిచిందని నల్లమిల్లి అధినేత వద్ద వాపోయారు. అనపర్తిలో తెలుగుదేశం ఉనికిని ప్రమాదంలో పడేసింది మీరేనని, దానికి కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మీపైనే ఉందని చంద్రబాబుకు చెప్పినట్టు రామకృష్ణారెడ్డి మీడియాకు తెలిపారు. రాజకీయ పరిణామాలతో అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి, రామకృష్ణారెడ్డి మాతృమూర్తి సత్యవతి భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. 42 ఏళ్లుగా తమ కుటుంబం తెలుగుదేశం పార్టీతోనే ప్రయాణం సాగిస్తోందని, తన భర్త, కుమారుడు నిత్యం ప్రజాసేవే పరమావధిగా ఉన్నారని, ఇప్పుడు తమ కుటుంబానికి సీటు లేదనడం భావ్యం కాదంటూ ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.



నల్లమిల్లి కోసం రూ.1 కోటి ఆస్తి ధారాదత్తానికి సిద్ధం


డాక్యుమెంట్లతో వచ్చిన సిరసపల్లి కుటుంబీకులు

అనపర్తి అసెంబ్లీ నుంచి రామకృష్ణారెడ్డి పోటీ చేయాలని, ఆయన విజయానికి ఏ త్యాగం చేయడానికైనా తమ కుటుంబం సిద్ధంగా ఉందని అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామానికి చెందిన సిరసపల్లి రమణమ్మ కుటుంబం పేర్కొంది. నల్లమిల్లి నివాసానికి వచ్చిన వారు తమ కూడా తెచ్చిన రూ.1 కోటి విలువైన ఆస్తి డాక్యుమెంట్లను చూపుతూ రామకృష్ణారెడ్డి విజయం కోసం తమ ఆస్తిని ధారాదత్తం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రమణమ్మ వెంట ఆమె తనయుడు సిరసపల్లి చంద్రశేఖర్. ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నల్లమిల్లికి బీవీఆర్ పరామర్శ



అనపర్తి అసెంబ్లీ టిక్కెట్టును బీజేపీకి మార్పు చేయడంతో అనపర్తిలోని టీడీపీ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్న తరుణంలో గురువారం మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసానికి చేరుకున్న రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి నల్లమిల్లిని పరామర్శించి సంఘీభావం ప్రకటించారు.

గుడ్ ఫ్రైడే..



గుడ్ ఫ్రైడే సందర్భంగా అనపర్తిలోని సత్య డ్రాయింగ్ అకాడమీకి చెందిన విద్యార్థి పైడిమళ్ల రాజు చిత్రీకరించిన చిత్రపటం ఇది. దేశంలోని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలపాలన్న సంకల్పంతో రాజు పెన్సిల్, వాటర్ కలర్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాడు. రాజును అకాడమి చైర్మన్ మందపల్లి సత్యానందం తదితరులు అభినందించారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

జనసేనలో చేరికలు



జనసేనలో సభ్యత్వం స్వీకరించిన వారినుద్దేశించి మాట్లాడుతున్న దుర్గేష్

నిడదవోలు, మార్చి 28: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి వైసీపీ సీనియర్ నాయకులు జనసేనలోకి రావడం శుభ పరిణామమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నిడదవోలులోని జనసేన కార్యాలయంలో అధ్యక్షుడు రంగా రమేష్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకుడు అనిశెట్టి శ్రీనివాస్‌తో పాటు మరో 25 మంది దుర్గేష్ చేతుల మీదుగా జనసేన కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది కూటమి ప్రభుత్వమేనని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో షేక్ సుభానీ, గూడా బాబీ, కోట నాగేశ్వరరావు, కంఠంశెట్టి శశిధర్ తదితర్లు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయ ఆదాయం రూ.22 లక్షలు



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, మార్చి 28: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ దేవస్థానంలో గురువారం దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 10-01-2024 నుంచి 27-03-2024 వరకు 78 రోజులకు రూ.22,03,839 ఆదాయం లభించిందని అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. వీటితో పాటు అన్నదాన ట్రస్టుకు రూ.28,085, బంగారం 31 గ్రాములు, వెండి 254 గ్రాములు, యూఎస్ఏ 10 డాలర్ల నోటు 1, యూఎస్ఏ 1 డాలర్ల నోటు 1, యూఏఈ 20 దినార్ల నోటు 1, యూఏఈ 10 దినార్ల నోటు 1, యూఏఈ 5 దినార్ల నోటు 1 లభించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ తదితర్లు పాల్గొన్నారు.

పంచాయతీ ఆసీలు వసూలుకు వేలం

తాళ్లపూడి, మార్చి 28: తాళపూడి పంచాయతీలో ఆసీలు వసూలుకు గురువారం కార్యదర్శి ఆశా అలేఖ్య ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. రోజు వారీ ఆసీలును గోట్టం లక్ష్మి రూ.1.92 లక్షలకు దక్కించుకోగా వారంపు సంతల ఆసీలు రూ.40 వేలకు సనపల స్వామినాయుడు దక్కించుకున్నారు. రోజువారీ ఆసీలు వసూలులో గత ఏడాది కంటే రూ.10 వేలు అధికంగా పంచాయతీకి ఆదాయం చేకూరిందని కార్యదర్శి తెలిపారు.

కులగణన జరిగితేనే బీసీలకు రాజ్యాధికారం

ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి



దేవరపల్లి, మార్చి 28: కులగణన జరిగితేనే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం దేవరపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణనకు బీజేపీ అడ్డుపడుతోందని అది జరిగితేనే బీసీలకు అన్నిరంగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలు వేరైన మన అజెండా ఒకటేనని పురందేశ్వరి అంటున్నారని, రాష్ట్రంలో కులగణనకు టీడీపీ, బీజేపీ, జనసేన మద్దతు తెలపాలని కోరారు. 2024 ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యమిచ్చిన వైసీపీకి మద్దతు తెలపాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనితను, ఎంపీ అభ్యర్థిని గుడూరి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దుద్దుకూరులో క్వారీ లారీల కార్మికుల దీక్ష

దేవరపల్లి, మార్చి 28: మండలంలోని దుద్దుకూరులో క్వారీ లారీల కార్మికులు వేతన పెంపు కోసం ఆరురోజులుగా సమ్మె చేస్తున్నా క్వారీక్రషర్ యాజమానులు పట్టించుకోవడంలేదని కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు సమ్మెకు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం 64 కార్మిక చట్టాలు రద్దు చేసిందని, కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, కనీస వేతనాలు లేవని అన్నారు. సంఘటిత పోరాటాలతో హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. క్వారీ, క్రషర్ యాజమానులు లారీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఎస్‌కే.మస్తాన్, జాన్‌రాజు, ఆచంట వరప్రసాద్, ఏడుకొండలు, సత్యనారాయణ, కొండయ్య, ఎం.రామకృష్ణ, యు.ప్రసాద్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా రవి



రవిని అభినందిస్తున్న న్యాయవాదులు

నిడదవోలు, మార్చి 28: నిడదవోలు బార్ అసోసియేషన్‌కు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ పదవికి మాత్రమే ఎన్నిక జరగగా మిగిలిన పదవులకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీ ఎన్నికల్లో గోగులమండ రవి విజయం సాధించినట్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపాడు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎమ్.రవికుమార్, ఉపాధ్యక్షుడిగా ఎ.విశ్వనాథం, సెక్రటరీగా ఎ.సతీష్, ట్రెజరర్‌గా జి.గంగాధర్ ఎన్నికయ్యారు. వీరందరిని న్యాయవాదులు అభినందించారు.

బాలికపై కోతులు దాడి

తలపై తీవ్ర గాయం..

ఆసుపత్రికి తరలింపు





కోతుల దాడిలో గాయపడిన చిన్నారికి కుట్లు వేస్తున్న డాక్టర్(పైన) చిన్నారి తలకు అయిన తీవ్ర గాయం(కింద)

గోపాలపురం, మార్చి 28: మండలంలోని పెద్దాపురంలో నాలుగేళ్ళ బాలికపై కోతులు గురువారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాధితుల వివరాల ప్రకారం.. తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామానికి చెందిన కొందరు కూలీలు వర్జీనియా పొగాకు పనుల నిమిత్తం పెద్దపురం వలస వచ్చారు. రోజువారి పనుల్లో భాగంగా గురువారం ఉదయం పెద్దవారంతా పనుల్లోకి వెళ్లిపోయారు. నాలుగేళ్ల ఆద్య జెస్సికా ఆడుకుంటుండగా కోతుల గుంపు దాడి చేసింది. ఈ దాడిలో బాలిక తలపై తీవ్రగాయం కావడంతో స్థానికులు హుటాహుటిన గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం చేయించారు. కాగా ఇటీవలె కోతుల దాడిలో ఓ విద్యార్థి తీవ్రగాయాలై ఆసుపత్రిపాలయ్యాడు. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కోతులను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పిన అగ్ని ప్రమాదం

తాళ్లపూడి, మార్చి 28: తాళ్లపూడిలో అగ్ని ప్రమాదం తప్పింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల అగ్ని ప్రమాదం తప్పింది. పాఠశాల సమీపంలో ఉన్న చెత్తకు ఆకతాయిలు గురువారం సాయంత్రం నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. దీంతో ప్రమాదం చుట్టు ప్రక్కల నివాసాల వారికి ప్రమాదం తప్పింది.

సాయిబాబాకు ఏకాదశ రుద్రాభిషేకం

నల్లజర్ల, మార్చి 28: అనంతపల్లి షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. తాడేపల్లిగూడేనికి చెందిన వేద పండితులు నుదురుపాటి శ్రీసూర్యశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, 108 కలశాలతో పుష్కర జలాలు, విశేష ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి



కేక్ కట్ చేస్తున్న జవహర్

- వ్యక్తుల కోసం కాదు పార్టీ కోసం కట్టు బానిసలా పనిచేస్తా
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్

కొవ్వూరు, మార్చి 28: వ్యక్తుల కోసం కాదు పార్టీ కోసం కట్టు బానిసలా పనిచేస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ అన్నారు. మాజీ మంత్రి జవహర్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించడంతో గురువారం కొవ్వూరులో పార్టీ కార్యకర్తలు, నాయకులు సంబరాలు నిర్వహించారు. ఆయనను ఘనంగా సత్కరించారు. జవహర్ కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవిష్యత్ తరాల ఉనికి, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబు ముఖ్యమంత్రి కావలిసిన సందర్భంలో పొత్తులు వల్ల, స్థానిక పరిస్థితులతో కొన్ని ఇబ్బందులు వచ్చినప్పటికీ అందరూ త్యాగాలకు సిద్ధపడాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆ నిర్ణయం ప్రకారం కొన్నిచోట్ల ఇబ్బందులు వచ్చినప్పటికీ ప్రత్యేకంగా కొవ్వూరులో దేని వల్ల వచ్చిందో కొత్తగా చెప్పవలసిన అవసరం లేదన్నారు. ఆ ఇబ్బందులన్నిటినీ అధిగమిస్తూ చంద్రబాబుకు తనపై నమ్మకంతో పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారన్నారు. నియోజకవర్గంలో ప్రతిక్షణం తన వెన్నంటి ఉన్న మిత్రులు చూపించిన ప్రేమ కారణంగానే వేరే చోటికి వెళ్లలేకపోయానన్నారు. సీటు వచ్చినా రాకపోయిన ఇక్కడే ఉండాలనే దృఢ సంకల్పంతో పని చేశామన్నారు. ఎన్నికల వరకు ఒక రకంగా, అయిన తరువాత మరో రకంగా ట్రీట్ చేసిన సందర్భాలు ఉన్నాయని, అవి పునరావృతం కాకుడదన్నారు. టీడీపీకి కట్టు బానిసలా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాను తప్ప వ్యక్తులకు కాదన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ శ్రేణులకు అండగా ఇక్కడే ఉంటానన్నారు. ఎవ్వరి దగ్గరకు వెళ్లమని చెప్పడం, ప్రాధేయ పడమనడం ఉండదని, ప్రభుత్వం వచ్చిన తరువాత అందరి పనులు చేస్తానన్నారు. కార్యక్రమంలో వేగి చిన్నా, బూరుగుపల్లి రాఘవులు, కోడూరి ప్రసాద్, కరుటూరి సతీష్, బొడ్డు రాజు, పసలపూడి బోసు, నరసయ్య, పిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు ముప్పిడి, మద్దిపాటి



కొవ్వూరు/నల్లజర్ల, మార్చి 28: జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు అష్టకష్టాలు పడ్డారని, వ్యవస్థలు, విధానాల్లో మార్పు కోరుకుంటున్నారని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గురువారం కొవ్వూరు టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో, నల్లజర్లలోని పార్టీ కార్యాలయంలో వేరువేరుగా జరిగిన పాత్రికేయుల సమావేశాల్లో వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ఒకటో తేదీ నాటికి ఎవ్వరికి జీతాలు అందడం లేదన్నారు. దివాళ తీసిన రాష్ట్రానికి జవసత్వాలు అందించాలనే లక్ష్యంతో టీడీపీ, జనసేన, బీజేఈ జత కట్టాయని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని గ్రహించాలన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక 7 సార్లు కరెంటు చార్జీలు పెంచారని, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు ప్రతి నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని, నాయుడు వీర్రాజు, కేవీకే రంగారావు, గెల్లా సురేష్, మద్దిపట్ల సురేష్, కలగర సుబ్బారావు, పెద్దాడ ఏసుబుజ్జి పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు



చాగల్లు: నెలటూరు సమావేశంలో మాట్లాడుతున్న అచ్చిబాబు

సైకో పాలన పోవాలి: అచ్చిబాబు

చాగల్లు, మార్చి 28: సైకో పాలన పోవాలి, ప్రజలు సంతోషంగా బతకాలనేదే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. గురువారం నెలటూరు కల్యాణ మండపంలోను, చిక్కాలలోను జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ కరువైందని, రాష్ట్ర బాగు కోసం ఏదో చేస్తారని నమ్మి జగన్‌కు ఓటు వేసిన ప్రజలు మోసపోయారన్నారు. కొత్త పరిశ్రమలు రాలేదని, ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని, పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, నాదెళ్ల శ్రీరామ్, తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, నందిగం శ్రీను, ఈదుపుగంటి మురళి, జనసేన నాయకులు గాయత్రి వెంకటేశ్వరరావు, కొప్పాక విజయకుమార్, అంజనేయులుపాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- ప్రభుత్వాన్ని మార్చడానికి చూపుడువేలును ఉపయోగించండి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న విధ్వంసకర, అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదలు నిలువునా వంచింపబడుతున్నారని, ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని పేర్కొన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో రాజమండ్రి పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, అసెంబ్లీ వారీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, కోర్ కమిటీ, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండలం అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పురందేశ్వరితోపాటు బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌ఛార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే పోలీసు కేసులు నమోదు చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని మార్చడానికి చూపుడువేలును ఉపయోగించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయాన్ని కూడా తనఖా పెట్టిన పరిస్థితి ఉందన్నారు. ఇసుక లేకపోవడం వల్ల రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారన్నారు. బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించలేదని, దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ కలగడంలేదని అన్నారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తరపున ఎవరు నిలబడినా అక్కడ నిలబడింది మోదీగానే భావించాలన్నారు. విశాఖ డ్రగ్స్ కేసులో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధంలేదని స్పష్టం చేశారు. సిద్ధార్థ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామని హామీ ఇస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థి శివరామకృష్ణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్, సాగి కాశీ విశ్వనాథరాజు, కోడూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం



నిలిచిపోయిన షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్

- రైలు బోగీలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ముందువైపు ఉన్న జనరేటర్ బోగీ(పవర్ కార్)లిపేర్
- 5.30గంటలపాటు ఆగిపోయిన ట్రైన్
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): షాలిమార్-సికింద్రాబాద్ వారాంతపు రైల్లో(నెం.22849) సాంకేతిక లోపం ఏర్పడి రాజమండ్రి రైల్వే స్టేషనులో 5.30గంటలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సికింద్రాబాద్ వెళ్తున్న రైలుకు కడియం రైల్వే స్టేషను దాటిన తర్వాత రైలు బోగీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులు రైలును నెమ్మదిగా రాజమండ్రి తీసుకొచ్చి రెండో ప్లాట్‌ఫాం వద్ద నిలిపారు. వెంటనే రైల్వే ఎలక్ట్రికల్ తదితర విభాగాల సిబ్బంది రంగంలోకి దిగి లోపాన్ని కనిపెట్టే పని చేపట్టారు. ఇంజన్‌లో లోపం ఉందనుకొని వేరొక ఇంజను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. రైలు బోగీలకు విద్యుత్ సరఫరా చేయడానికి ముందు, వెనుక రెండు జనరేటర్ బోగీలు ఉంటాయి. ముందువైపు ఉన్న జనరేటర్ బోగీ(పవర్ కార్)లో లోపం తలెత్తిందని గుర్తించారు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వెనుక కూడా వేరొక ఇంజను అమర్చి.. వెనుక ఉన్న పవర్ కార్ ద్వారా విద్యుత్తు సరఫరా చేశారు. దీంతో ఉదయం 7.30గంటలకు వచ్చిన రైలు మధ్యాహ్నం 1గంటలకు బయలుదేరింది. అప్పటికే ఈ రైలు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తుండడం గమనార్హం.

ప్రయాణికులకు నరకం

రైలుకు 19బోగీలు ఉండగా అందులో 12 ఏసీ బోగీలు ఉన్నాయి. మొత్తం అన్ని బోగీల్లోనూ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఏసీలు ఆగిపోవడంతో ఆ బోగీల్లోని ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. గాలి ఆడకపోవడంతో చిన్న పిల్లలను ఊరడించడం కష్టంగా మారింది. సెల్‌ఫోన్లలో చార్జింగ్ అయిపోవడంతో ప్లాట్‌ఫాంపై ఉన్న సాకెట్లలో చార్జింగ్ పెట్టుకొన్నారు. కొన్ని బోగీల్లో నీటి సరఫరా కూడా ఆగిపోయింది. ప్యాంట్రీ కార్(వంట బోగీ)లో కూడా విద్యుత్ నిలిచిపోవడంతో టీ తయారు చేయడానికి కూడా వీలు లేకుండాపోయింది. గంటలపాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు సహనం కోల్పోయారు. రెండో ప్లాట్‌ఫాంపై ఉన్న స్టేషను మాష్టారు గది వద్ద గుమిగూడి వాగ్వాదానికి దిగారు. తమ బంధువు హార్ట్ పేషెంట్ అని, అన్ని గంటలు ఏసీలు ఆగిపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారంటూ ఓ మహిళ స్టేషను మాష్టారి వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. వాళ్లకు సర్దిచెప్పడానికి అధికారులు శ్రమించాల్సి వచ్చింది. ఈ మధ్య రైళ్లలో సాంకేతిక లోపాలు ఎక్కువగా తలెత్తి గంటలపాటు నిలిచిపోతుండడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 18న రాజమండ్రిలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోని ఏసీ బోగీలో ఇబ్బంది తలెత్తడంతో ఆ బోగీలోని ప్రయాణికులను వేరేబోగీలో సర్దుబాటు చేసి పంపించారు. అంతకుముందు వందే భారత్‌లో ఏసీ సమస్య వచ్చింది. ఇటీవల వందేభారత్‌లో ఏసీలు పనిచేయకపోవడంతో విశాఖ నుంచి వేరొక ఏసీ రైలు ఏర్పాటు చేశారు.

ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఎస్ఐ లోవరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. స్టేషను మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కళ్యాణ్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ సురేంద్ర, లోకో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు మరమ్మతు పనులను పర్యవేక్షించారు.



రైల్వే అధికారులతో ప్రయాణికుల వాగ్వాదం

ప్రత్యేక అవసరాల పిల్లలకు సేవలు

కొవ్వూరు, మార్చి 28: ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్రశిక్షా ప్రాజెక్టు, భవిత కేంద్రాల ద్వారా సేవలు అందజేస్తున్నట్టు సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా సమగ్రశిక్షా, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహించారు. క్యాంపును ప్రారంభించిన సుభాషిణి మాట్లాడుతూ ఎంతోమంది ప్రత్యేక అవసరాల పిల్లలు సమగ్రశిక్షా ప్రాజెక్టు, భవిత కేంద్రాల ద్వారా సహాయం పొంది, చదువుకుని జీవితంలో స్థిరపడ్డారన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మిత శిబిరాన్ని పర్యవేక్షించారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఎన్.కనకబాబు మాట్లాడుతూ శిబిరానికి ఆడియాలజికి సంబంధించిన పిల్లలు అధికంగా వచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ రాణి, ఎంఈవోలు జె.కెంపురత్నం, కిషోర్, రిసోర్స్‌పర్సన్లు, ఐఈఆర్‌పీ టీచర్‌లు, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం, తాళ్లపూడి, కొవ్వూరు మండలాలకు చెందిన పిల్లలు, తల్లిదండ్రులు హాజరయ్యారన్నారు.

ఎన్నికల నియమావళి అమలుకు పకడ్బందీ చర్యలు

- రీజియన్ పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లతో సమన్వయం
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

కొవ్వూరు, మార్చి 28: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ జనరల్ (ఐజీ) జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం కొవ్వూరు టౌన్, రూరల్ పోలీసుస్టేషన్లు, డీఎస్పీ కార్యాలయంలో వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఏలూరు రేంజ్ పరిదిలోని ఆరు జిల్లాల్లో కలెక్టర్‌లు, ఎస్పీలను సమన్వయం చేసుకుని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యులలో ఇంతవరకు ఆరు జిల్లాల్లో 1842 ఎన్‌బీడబ్ల్యులు ఎగ్జిక్యూట్ చేశామన్నారు. జిల్లాలో వీఐపీలు, ప్రజా ప్రతినిధులు పర్యటించినప్పుడు భద్రతా పరంగా బందోబస్తు నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకుండానే డిసెంబరు నుంచి ఎన్ఫోర్సుమెంటు అమలు ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఐడీ లిక్కర్, పులిసిన బెల్లపుఊట, ఎన్‌డీపీఎల్ సీసాలు, టెట్రా ప్యాకెట్‌లు డీపీఎల్ (గంజాయి), ఎన్‌డీపీఎస్, క్యాష్, ప్రీసీయస్ మెటల్, ఫ్రీ బీస్ తదితరాలకు చెందిన 7489 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 4067 మందిని అరెస్టు చేసి రూ.15,53,74,279 విలువ గల వాటిని సీజ్ చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావాన్ని తగ్గించడానికి చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి దాడులు మరింత తీవ్రతరం చేశామన్నారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సరళిపై పోలీసు సిబ్బందికి శిక్షణను అందజేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుంచి పోలింగ్ రోజు తీసుకోవలిసిన భద్రతా పరమైన చర్యలు, కౌంటింగ్ సమయంలో ఏ విధమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలనే అంశాలపై పోలీసు సిబ్బందికి శిక్షణను అందజేస్తున్నామన్నారు. పోలీసు స్బిబంది ఎటువంటి తప్పులు చేయకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఐజీ వెంట జిల్లా ఎస్పీ పి.జగదీష్, డీఎస్పీ కేసీహెచ్ రామారావు, సీఐలు వి.జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కవలగొయ్యిలో ఓ వ్యక్తి హత్య

మద్యం తాగించి కత్తితో పొడిచిన వైనం

వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఘటన

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మృతుడి తల్లి పలుకూరి సరోజిని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. సరోజిని చిన్న కుమారుడు భాస్కరరావు(35)కు సత్యవాణితో 17ఏళ్ల క్రితం వివాహం జరిగింది. తర్వాత మనస్పర్థల వల్ల 12ఏళ్ల క్రితమే కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. దీంతో భాస్కరరావు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. అదే ప్రాంతంలో పాత ఇనుము వ్యాపారం చేసే గుజ్జు లక్ష్మీ భర్తతో గొడవల వల్ల ఐదేళ్ల నుంచీ విడిగా ఉంటోంది. భాస్కరరావుకు ఆమెతో పరిచయం ఏర్పడి మూడున్నరేళ్ల నుంచీ సహజీవనం చేస్తున్నాడు. ఈ మధ్య భాస్కరరావును ఇంటికి రావద్దంటూ లక్ష్మీ దూరం పెట్టింది. దీంతో అతడు తాగుడుకు బానిసయ్యాడు. ఇదిలా ఉండగా.. భాస్కరరావుతో కందిరెల్లి నారాయణమూర్తి అనే వ్యక్తి కొన్ని రోజులుగా పరిచయం పెంచుకున్నాడు. అతడితో లక్ష్మీకి పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10.30గంటల సమయంలో మందు తాగుదామంటూ భాస్కరరావును నారాయణమూర్తి తీసుకెళ్లాడు. తన పొలం దగ్గరలోని లక్ష్మీనగర్‌లో ఉన్న గంగుల సూర్యనారాయణ లేఅవుట్ దగ్గరలోని వాచ్‌మెన్ నివాసం ఉండే పాక ఎదురుగా బాగా మందు తాగించాడు. అర్ధరాత్రి 12.30గంటల ప్రాంతంలో తన వెంట తెచ్చుకున్న కత్తితో భాస్కరరావును తల తదితర చోట్ల పొడుస్తుండగా వాచ్‌మెన్ చూసి పారిపోయాడు. గురువారం ఉదయం తన వద్దకు వచ్చి విషయం చెప్పగా చెల్లి చింతలపూడి సత్యవతితో కలిసి వెళ్లి చూడగా రక్తపు మడుగులో భాస్కరరావు చనిపోయి ఉన్నాడని సరోజిని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గోపాలపురం, మార్చి 28: మండలంలోని పెద్దాపురంలో శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. మూడురోజులపాటు జరిగిన ఈ కార్యక్రమాల్లో చివరిరోజైన గురువారం మంగళవాయిద్యాలు, వేదస్వస్తి విఘ్నేశ్వర గోపూజ, ధ్వజస్తంభ సంస్కారం, హోమాలు, పూర్ణాహుతి, మంగళహారతులు చేపట్టారు. కార్యక్రమాల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ హనుమంతవజ్ర కాశీ విశ్వనాథశర్మ, చిట్యాల, పెద్దాపురం, వేలచింతలగూడెం పురోహితుల ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనసూయాదేవి జయంతి

కొవ్వూరు, మార్చి 28: మాతృశ్రీ అనసూయాదేవి(జిల్లేలమూడి అమ్మ) 101వ జయంతిని కొవ్వూరులో నిర్వహించారు. గురువారం కొవ్వూరు థియేటర్ రోడ్‌లో మినరల్ వాటర్‌ప్లాంట్ వద్ద శివరామ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడివాక రామకృష్ణకుమార్, జీవీఎస్ ప్రసాద్, గుడివాక స్వర్ణలత, ఎల్.రామలక్ష్మి పాల్గొన్నారు.

వేలివెన్నులో ఆలయానికి శంకుస్థాపన

ఉండ్రాజవరం, మార్చి 28: మండలంలోని వేలివెన్నులో లక్ష్మీ కనకదుర్గ ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. వేదపండితులు మంత్రోచ్ఛరణలతో పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కుంగ్‌ఫూ పాండా..
వై.స్క్రీన్ 2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	భీమా
నిడదవోలు	
వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
శ్రీగణపతి	ఓం బీం బుష్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి